

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా


Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 237 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 24, జూలై 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్






# స్థానిక నేతలకు సోయి లేదు



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



విద్యార్థుల ఉసురు పోసుకుంటున్నారు

ఫీజుల బకాయిలు తెప్పించలేని నాయకులు అక్రమ అరెస్టులకు ఉసుగొలుపుతున్నారు

చెప్పుడు లేదు చేసుడు లేదు. విద్యార్థి నేతలను దొంగాళ్ల వచ్చి ఎత్తుకెళ్తున్నారు

ఒక్క రోజు బందు పిలుపునకు, విద్యాసంస్థలకు వచ్చే నష్టమేమీ లేదు

ఫీజుల బకాయిలు చెల్లించాలని బంధు పిలుపునిస్తే ఉక్కు పాదం మోపుతున్నారు

అక్రమ అరెస్టులతో నిర్బంధిస్తే సమస్యలు పరిష్కరించబడినట్లేనా?

సుమారు 8000 కోట్ల పైన ఫీజు రేయింబర్స్మెంట్ ఇవ్వలేని ప్రభుత్వం

కన్నతల్లికి అన్నం పెట్టనోళ్లు పిన్న తల్లికి బిర్యాని పెడతాం అన్నట్లుగా ఉంది

పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించలేని ప్రభుత్వం

ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజులు నియంత్రించాల్సిందే

డాక్టర్ బరిగెల శివ



హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం విద్యాసంస్థల బందుకు పిలుపునిచ్చిన విద్యార్థులను అకారణంగా అరెస్టులు చేయడం ముమ్మాటికి తప్పని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా ఖండించారు.ఒకరోజు విద్యాసంస్థలకు బందు పిలుపునిస్తే పెద్దగా నష్టమేమి లేదన్నారు.మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు రావలసిన ఫీజుల బకాయిలు 8000 కోట్ల రూపాయలకు పెరిగిపోవడంతో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా సాగుతుందని తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేశారు.ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ యూనివర్సిటీలను ప్రోత్సహిస్తూ ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజులను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైనందున రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా ప్రమాణాలు పూర్తిగా వెనుకబడిపోతున్నాయన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో అనుమతులు లేని ప్రైవేట్ విద్యాసంస్థలు కొనసాగించబడుతున్నప్పటికిని వాటిపై ప్రభుత్వాలు చర్య తీసుకోవడంలో వెనకడుగు వేస్తుండడం వాటి ప్రభావం ప్రభుత్వ విద్యాసంస్థలపై పడుతున్నాయన్నారు. విచ్చలవిడి దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు విద్యాసంస్థలను కట్టడి చేయడంలో ప్రభుత్వం,ప్రభుత్వ అధికార యంత్రాంగం

- మిగతా 3లో..

## పదేళ్లలో ఆర్టీసిని నిర్వీర్యం చేశారు

ఓ దశలో ఆర్టీసీ మనుగడపైనా ఆందోళన

ఇప్పుడిప్పుడే సంస్థను లాభాల్లోకి తెస్తున్నాం

200 కోట్ల ప్రయాణాల పూర్తి వేడుకల్లో మంత్రి పొన్నం



## తెలంగాణ స్థానికతపై సుప్రీంలో విచారణ

పరిష్కారం వెదకాలని ప్రభుత్వానికి ఆదేశం



2

## బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదించకుండా తాత్సారం

మత ప్రాతిపదికన రిజర్వేషన్లు లేనేలేవు

వెనకబాటుతనం ప్రాతిపదికన గుర్తింపు

పార్లమెంటులో ఒత్తిడి తెచ్చేలా కాంగ్రెస్ పెద్దలకు నివేదిస్తా

ఢిల్లీలో మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి



2



## ప్రెస్ అకాడమీ తీరుపై మండిపడ్డ జర్నలిస్టులు

టీయూడబ్ల్యూజే పై ఆగ్రహం వ్యక్తం చేసిన వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్

ప్రెస్ అకాడమీ నిర్వహించే శిక్షణ తరగతులకు యూనియన్ మీ పేరు ఎందుకు..?

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు

తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో జర్నలిస్టుల ఆందోళన

వివరాలు 4లో

## దత్తాత్రేయను ఉప రాష్ట్రపతి చేయాలి

3

తెలంగాణ నేతలకు బిజెపి అన్యాయం చేస్తోంది

ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా విచారకరం

ఢిల్లీ మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి డిమాండ

## నైట్ పార్క్ చేసిన బస్సు దగ్ధం

నిప్పు పెట్టిన దుండగులు

మిర్యాలగూడ,జూలై23(జై భీమ్ న్యూస్) : పార్కింగ్‌లో ఉన్న నైట్‌హాల్ట్ ఆర్టీసీ బస్సుకు కొందరు దుండగులు నిప్పుపెట్టారు. ఈ ఘటన నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో అర్ధరాత్రి చోటు-చేసుకుంది. మిర్యాలగూడ డిపోనకు చెందిన బస్సును రోజు మాదిరిగానే గ్రామంలోని ప్రధాన బస్‌స్టాప్ కూడలిలో పార్కింగ్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు బస్సు వెనుకవైపు నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్, కండక్టర్.. పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారమందించడంతో మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో బస్సు వెనుక భాగం టైర్లతో సహా పూర్తిగా దగ్ధమైంది. నిప్పుపెట్టిన ఆకతాయిల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఎవరు ఈ పనిచేశారన్నది పోలీసులు ఆరా తీస్తున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా


# బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదించకుండా తాత్సారం

**న్యూఢిల్లీ,జూలై23(జై భీమ్ న్యూస్) :**

తెలంగాణ ప్రభుత్వం పంపిన బిసి రిజర్వేషన్ల బిల్ ఆమోదించకుండా కేంద్రం ఆలస్యం చేస్తున్నదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్య ఉపాధి అంశాలతో పాటు, స్థానిక సంస్థల రిజర్వేషన్ల రెండు బిల్లులను ఆమోదించడం లేదన్నారు. బుధవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రం బిల్లును ఆమోదించకపోతే, ఒత్తిడి తెచ్చేందుకు మా వ్యూహం మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు లేవని.. మతాలు ప్రాతిపదిక కాదన్నారు. వెనుకబాటు తనమే తమ ప్రాతిపదిక అని స్పష్టం చేశారు. గురువారం ఉదయం మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలను కలుస్తామని తెలిపారు.. సర్వే వివరాలు వివరిస్తామని స్పష్టం చేశారు. తమ తరఫున పార్లమెంట్ లో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరతమన్నారు. అలాగే సర్వే కోసం జరిగిన ప్రక్రియ పై కాంగ్రెస్ ఎంపీలకు వివరిస్తామని వెల్లడించారు. జనగణనలో కులగణన చేర్చాలని.. జనగణనలో కులగణన ఎలా చేయొచ్చు.. దేశానికి తెలంగాణ మోడల్ గా నిలిచిందో వివరిస్తామన్నారు. తాము చేసిన సర్వే దేశానికి రోల్ మోడల్ అని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి తమ కార్యాచరణ సిద్ధం చేశామని వెల్లడించారు. కేంద్రం రిజర్వేషన్లను ఆమోదించాలని.. అందుకే కేంద్రం పై ఒత్తిడి తేవాలన్నారు. అవసరం అయితే కూటమి నేతలను కూడా కలుస్తామని చెప్పారు. సోషల్ జస్టిస్‌కు అందరూ సహకరించా లని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గుజరాత్, యూపీ, మహారాష్ట్రలో ముస్లింలకు రిజర్వేషన్లు ఉన్నాయి. అక్కడ ముస్లిం రిజర్వేషన్లు తొలగించి బీజేపీ నేతలు తెలంగాణ గురించి మాట్లాడాలి. బీజేపీ నేతలు వితండ వాదం చేస్తున్నారు. ఒక ఇంటర్వ్యూలో ముస్లిం రిజర్వేషన్లు అమలు చేస్తాం అని అమిత్ షా అన్నారు. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా..? కేంద్రం తక్షణమే బిల్లును ఆమోదించాలి. సర్వేను శాసన సభలో ప్రవేశ పెట్టి పూర్తి స్థాయిలో చర్చకు అవకాశం ఇచ్చాం. వ్యక్తుల వ్యక్తిగత వివరాలను బహిరంగ పరచలేదు. 3.9 శాతం ప్రజలు తమకు ఏ కులం లేదని డిక్లేర్ చేశారు. ఎక్స్పర్ట్స్ కమిటీ- ఇచ్చిన రిపోర్ట్ ను రోడ్ పై పెట్టలేం. ఫస్ట్ క్యాబినెట్ ముందు పెట్టాలి. శాసన సభలో ప్రశ్నిస్తే.. సమాధానం చెప్తాం. అడిగిన వివరాలు ఇస్తాం. పబ్లిక్ డొమైన్ లో పెట్టేటప్పుడు.. అన్ని న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తాం. క్యాబినెట్‌లో చర్చించి, శాసన సభలో ప్రవేశ పెడతాం. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు లేవు. మతాలు ప్రాతిపదిక కాదు. వెనుకబాటు తనమే మా ప్రాతిపదిక. బీజేపీ తొండి వాదన చేస్తోంది. తమ దగ్గర రీసెర్చ్ అండ్ అనాలసిస్ వివరాలు ఉన్నాయని సిఎం వివరించారు.

# ఆర్ట్స్ కళాశాలలో "అసలేం" జరుగుతుంది?







**ఆర్ట్స్ కళాశాల అవినీతిపై నిగ్గు తేల్చండి?**
**గిరి లెక్కల్లో గందరగోళం**
**అనధికార హోదాలో 10 సంవత్సరాలుగా పాగా వేసిన "గిరి"**
**ఆర్ట్స్ కళాశాల ఎగ్జామ్ బ్రాంచ్ అవినీతి నిర్వహణపై విచారణ జరిపించాలి**
**గిరి ప్రసాద్‌కు చెందిన ఆర్డర్ ఏమిటి చేసే పని ఏంటి పాఠాలు చెప్పకుండా జీతాలు ఎలా తీసుకుంటున్నాడు**
**10 సంవత్సరాలుగా ప్రిన్సిపాల్ లను బోల్తా కొట్టిస్తున్న గిరిబాబు**
**10 సంవత్సరాలుగా సర్టిఫికెట్లపై సంతకాలు ఎవరివి**
**అవినీతి లెక్కలను స్టేట్ ఆడిట్ దొరక పట్టిన మేనేజ్ చేస్తున్న అధికారు లెవరు**
**గిరి ప్రసాద్ పది సంవత్సరాల పదవికాలాలపై విచారించాల్సిందే**
**10 ఏళ్ల అవినీతి బాగోతంలో అధికారుల వాటాలు ఎంత**

**సుబేదారి జై భీమ్ న్యూస్:-**

కాకతీయ విశ్వవిద్యాలయంలో అంతర్భాగమైన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అటానామస్ కళాశాల కావడంతో 15 సంవత్సరాలుగా అవినీతిలో రెచ్చిపోతూనే ఉందనిపూర్వ విద్యార్థులు తీవ్రంగా మండిపడుతున్నారు.అనధికార హోదాను అధికార హోదాగా మార్చుకొని తప్పుడు హోదాలో సంతకాలు పెడుతూ ధ్రువపత్రాలను మంజూరు చేస్తున్న వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు లెక్కలేనన్నిసార్లు ఇటు ప్రిన్సిపాల్స్ అటు కేయూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కేవలం అవినీతి కోసం గిరి ప్రసాద్ ను ఆర్ట్స్ కళాశాల ఎగ్జామినేషన్ బ్రాంచ్ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ లో కొనసాగిస్తున్నారని ఊహించని విమర్శలు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి.ఏం చేసినా మమ్మల్ని అడిగే నాధుడే లేడని దృఢమైన తెగింపుతో పార్ట్ టైం అధ్యాపకునిగా కొనసాగుతున్న గిరిప్రసాద్ పాఠాలు చెప్పకుండా జీతాలు తీసుకుంటూ ఉండడం ఒకే ఎత్తైతే పది సంవత్సరాల కాలం పాటుఆర్ట్స్ కళాశాల ఎగ్జామ్ బ్రాంచ్ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ లో పనిచేస్తూ అవినీతికి పాల్పడుతున్నాడని అందుకోసమే అధికారులు తన పలుకువడికి లొంగి పది సంవత్సరాల కాలం పాటు అనధికార హోదాలో తననే కొనసాగిస్తుండడం తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది.ఒకవైపు పార్ట్ టైం అధ్యాపకునిగా అధికార హోదాలో కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ అనుబంధ కార్యాలయమైన టీచింగ్ కార్యాలయం నుండి ఆర్డర్స్ పొందుకొని వాటిని ధిక్కరిస్తూ ,బేకదారు చేస్తూ నాన్ టీచింగ్ ఉద్యోగి నిర్వహించాల్సిన విధులను నిర్వహిస్తూ కాన్ఫిడెన్షియల్ సెక్షన్లో రహస్యంగా చొరబడి రాటు తేలిపోయి ఏకంగా సిఎంపి అకౌంట్స్ను మేనేజ్ చేసే స్థాయికి ఎదిగిపోయాడంటే అధికారుల బలం అవినీతిని ఎంతగా ప్రోత్సహిస్తుందో అర్థమయిపోతుందని విద్యార్థులు తీవ్రంగా వాపోతున్నారు. అవినీతిపరులపై ప్రస్తుత ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి, కేయూ అధికారులు కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

**గిరి లెక్కల్లో గందరగోళం?**

గతంలో మాజీ ప్రిన్సిపల్ ఆచార్య టి.మనోహర్ నుకమిటీ చైర్మన్గా నియమిస్తూ మాజీ,వీసి రిజిస్ట్రార్లు ఆర్ట్స్ కళాశాల అవినీతిపై కమిటీ వేయగా క్షేత్రస్థాయిలో రికార్డులను పరిశీలించిన కమిటీ నిజ నిర్ధానులతో కూడిన ఆధారాలను సేకరించి అధికారికంగా 72 లక్షల అవినీతి అనధికారంగా మూడు కోట్ల 50 లక్షల అవినీతి దోపిడి జరిగినట్లు నిర్ధారించారని విద్యార్థి సంఘాల నేతలు వెల్లడిస్తున్నారు.కమిటీ నివేదికపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య బన్న ఐలయ్యపై కనీసం చర్యలు చేపట్టకుండా తిరిగి అదే కళాశాలకు ప్రిన్సిపాల్ గా నియమించి అవినీతికి సంబంధించిన ప్రత్యక్షపు బలనిరూపణను నిరూపించుకున్నారని అధికారుల మొద్దు బారినతనానికి విద్యార్థులు మనోవేదన చెందారని గుర్తుకు చేస్తున్నారు.పదవీ విరమణ పొందాక తనకు రావలసిన బెన్ఫిట్స్ అన్ని చెల్లించి కమిటీ నివేదికను కనుమరుగు చేయడాన్ని విద్యార్థులు ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు.?ప్రస్తుతం ఆర్ట్స్ కళాశాల ఎగ్జామినేషన్ బ్రాంచ్ కాన్ఫిడేన్షియల్ శాఖలో గిరి ప్రసాద్ ఎలా మాకం వేశాడడో? 10 సంవత్సరాలుగా గిరిప్రసాద్ విద్యార్థుల ధ్రువపత్రాలపై అనధికార హోదాలో సంతకాలు చేస్తూ మంజూరు చేస్తున్నాడో? అట్టి విధానంపై విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రెగ్యులర్ నాన్ టీచింగ్ ఉద్యోగి కొనసాగించాల్సిన కాన్ఫిడెన్షియల్ విధులను పార్ట్ టైం అధ్యాపకుడైన గిరి ప్రసాద్ కే ఎందుకు కేటాయించారు. ప్రశ్నాపత్రాలు మూల్యాంకన పత్రాలు పరీక్ష ఫలితాల విడుదల ఇవన్నీ ఇలా కాన్ఫిడెన్షియల్ గా కొనసాగాయి అనే దానిపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని విద్యార్థులు మొండిపట్టబడుతున్నారు. గతంలో విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజుల పట్ల ఆర్ట్స్ కాలేజ్ అధికారులు గవర్నింగ్ బాడీ కమిటీ వేసుకుని ఎంత సొమ్మును మాఫీ చేసుకున్నారో అట్టి గవర్నింగ్ బాడీ పై ఎవరెవరు సంతకాలు చేశారో వాటి వివరాలు బయట పెట్టాలంటున్నారు. ఆర్ట్స్ కళాశాల సొమ్మును అడ్డగోలుగా దోసుకున్న మాజీ ప్రిన్సిపాల్ కు పూర్తిగా సహకరించిన గిరి ప్రసాద్ నిర్వహించిన విధుల పట్ల శ్వేత పత్రం విడుదల చేయాలని గట్టిగా పట్టుబట్టి అడుగుతున్నారు. ఆర్ట్స్ కళాశాల అటానమస్ కళాశాల కావడంతో అవినీతిని ప్రశ్నించే నాధుడే లేకుండా పోయారని చివరకు భరించలేని పరిస్థితిలో విద్యార్థులు ఉద్యమించాల్సి వస్తుందంటున్నారు. పరీక్ష ప్రక్రియ, పేపర్ల మూల్యాంకనం, సర్టిఫికెట్ల ప్రింటింగ్,గిరిప్రసాద్ ఎలా కొనసాగించాడో అధికారులు పత్రికాముఖంగా తెలుపాలని డిమాండ్ చేస్తున్నారు. గిరిప్రసాద్ ఆర్డర్ పార్ట్ టైం కోసమా ,ఎగ్జామ్ బ్రాంచ్ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ కోసమా?తెలుపాల్సిన బాధ్యత అధికారులకు లేదా అని సూటిగా అడుగుతున్నారు. సంవత్సరాలుగా పాఠాలు బోధించని గిరిప్రసాద్ కు జీతాలు ఎలా చెల్లిస్తున్నారో.ఆధారాలు బయటపెట్టాలంటున్నారు. గిరి ప్రసాద్ కాన్ఫిడెన్షియల్ కార్యాలయంలో పరీక్షల నియంత్రణ కాన్ఫిడెన్షియల్ విభాగంలో కొనసాగిస్తున్న అవినీతిలో వాటాదారులు ఎవరెవరు అంటూ వారందరూ లెక్కలు బయట పెట్టాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు?. అనధికార హోదాలో గిరిప్రసాద్ ను కొనసాగిస్తున్నది కేవలం అవినీతి సొమ్మును సంపాదించడం కోసమేనా? అంటూ పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి .విశ్రాంత ఆచార్య బన్న ఐలయ్యపై వేయబడిన కమిటీలో 72 లక్షలు అధికారికంగా, మూడు కోట్ల 50 లక్షలు పరోక్షంగా అవినీతి జరిగిందని కమిటీ తేల్చగా చర్యలు ఎందుకు తీసుకోలేదు? 10 ఏళ్లుగా గిరి ప్రసాద్ ఏ హోదాలో కాన్ఫిడెన్షియల్ బిల్ ప్రపోజల్ పెడుతున్నాడో వాటిని అధికారులు ఎందుకు కప్పిపుచ్చుతూ విధుల్లో కొనసాగిస్తున్నారోలెక్కలు బయటపెట్టాల్సిందేన అంటూ తీవ్రంగా మండిపడుతున్నారు. అక్రమమైన పద్ధతిలో గిరి ప్రసాద్ ను కొనసాగించి అవినీతికి పాలు పడ్డ అధికారులందరిపై చర్యలు తీసుకోవాల్సిందేనంటూ. పది ఏండ్లుగా గిరిప్రసాద్ సంపాదనపై క్షేత్రస్థాయి విచారణ కమిటీ వేసి కమిటీ నివేదికల ఆధారంగా చర్యలు చేపట్టాలి.( సిఎంపి )క్యాష్ మేనేజ్మెంట్ (ప్రాసెస్ )ప్రపోజల్ అకౌంట్ రికార్డ్స్ బిల్లులపై అనధికార సంతకాలు ఎవరివని గుర్తుకు చేస్తూ. కాన్ఫిడెన్షియల్ సెక్షన్ లో గిరి ప్రసాద్ ఉపయోగిస్తున్న లాప్టాప్ ను విచారిస్తే బోలెడు విషయాలు వెలుగులోకి వచ్చే ఆస్కారం ఉందని చెబుతున్నారు. 10 సంవత్సరాలలో ఎన్ని వేల సర్టిఫికెట్స్ ను మంజూరు చేశాడో వాటి రుసుము ఎంతో ప్రతి పైసను లెక్కలుకట్టి ఆధారాలన్నింటిని విశ్వవిద్యాలయ సమాజానికి తెలియజేయాల్సిన అవసరం అధికారులపై ఉందని గుర్తుకు చేస్తూ .లేదంటే అనధికార హోదాలో గిరి ప్రసాద్ కొనసాగిస్తున్న అవినీతిలో అధికారుల వాటా ఉందని ఒప్పుకొని వాళ్ల వాళ్ల నిజాయితీ నిరూపించుకోవాలని విద్యార్థులు హెచ్చరిస్తున్నారు.

**ఆ "ఆరు" కోట్లపై అందరికన్నా త్వరలో....**

**బండారి సుమన్ జై భీమ్ హన్మకొండ కేయూ ఇంచార్జ్.**

# జిల్లావ్యాప్తంగా విత్తనాలు ఎరువులు దుకాణంలో పోలీసు తనిఖీలు

**భూపాలపల్లి, జై భీమ్ న్యూస్**






భూపాలపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు, ఎమ్మార్వోలతో సంయుక్తంగా ఏర్పడి జిల్లా పోలీసులు జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న విత్తన ఎరువుల దుకాణంలో, ఎరువుల స్టాక్ పై తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా ఎరువుల సంచులపై ఉన్న లేబుల్ తో పాటు లేబుల్లో ఉన్న వివరాలు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాములలో నిలువ ఉంచిన విత్తన సంచుల ఎరువుల వివరాలను సేకరించారు. లైసెన్స్ వివరాలను అలాగే ఎరువుల సంచులను సరఫరా చేసిన కంపెనీ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫెర్టిలైజర్స్ షాప్ లపై ప్రతి రోజు తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ తనిఖీలలో ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్సై లు, ఎమ్మార్వో లు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పదేళ్లలో ఆర్టీసిని నిర్వీర్యం చేశారు

**ఓ దశలో ఆర్టీసీ మనుగడపైనా ఆందోళన**
**ఇప్పుడిప్పుడే సంస్థను లాభాల్లోకి తెస్తున్నాం**
**200 కోట్ల ప్రయాణాల పూర్తి వేడుకల్లో మంత్రి పొన్నం**



**హైదరాబాద్,జూలై23(జై భీమ్ న్యూస్):**

గత 10 సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను నిర్వీర్యం చేశారని, ఓ సమయంలో ఆర్టీసీ ఉంటుందా అన్న ఆందోళనకర పరిస్థితి ఉండేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వస్తుందని తెలిపారు. గత 10 సంవత్సరాల్లో ఆర్టీసీ ఉద్యోగుల పైసలు వాడుకున్న పరిస్థితి ఉండేదని, ఇప్పుడు వారికి డబ్బులు చెల్లిస్తున్నాం అని చెప్పారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు బస్సులకు యజమానులకు చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాలకు బస్సులు కొనుగోలు చేసిందన్నారు. ఆర్టీసీకి ఈ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అండగా ఉంటుందని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. 200 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంజీబీఎస్ బస్టాండ్‌లో ఆర్టీసీ వేడుకలునిర్వహించింది. డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ వేడుకలకు మంత్రి పొన్నం హాజరై మాట్లాడారు. 200 కోట్ల మహిళా ఉచిత ప్రయాణం పూర్తయిన సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన 2023 డిసెంబర్ 9న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా శాసన సభ వేదిక మహాలక్ష్మి పథకం ప్రారంభించుకున్నాం. ఇప్పటివరకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకున్నాం. ఈ పథకం విజయవంతం కావడానికి కృషి చేసిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లకు అభినందనలు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఎక్కడికి వెళ్లాలన్నా ఉచితంగా వెళ్తున్నారు. ఉద్యోగాలు, షాపింగ్, దేవాలయాలు... ఎక్కడికి వెళ్లాలన్నా ఉచిత ప్రయాణం ఉపయోగించుకుంటున్నారు. గత 10 సంవత్సరాల్లో ఆర్టీసీని నిర్వీర్యం చేశారు. ఆర్టీసీ ఉంటుందా అని కూడా అనుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆర్టీసీ నష్టాల నుండి లాభాల్లోకి వస్తుంది. కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నాం, నియామకాలు చేస్తున్నాం అని మంత్రి పొన్నం తెలిపారు. సంస్థ పరిరక్షణ ప్రయాణికుల సౌకర్యం ఉద్యోగుల సంక్షేమం నినాదంతో ఆర్టీసీ ముందుకు పోతుంది.ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు- బస్సులకు యజమానులకు చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాలకు బస్సులు కొనుగోలు చేసింది. ఇటీవల 150 బస్సులకి కోటి రూపాయల చెక్కులు కూడా అందజేసాము. గతంలో 45 లక్షల మంది ప్రయాణం చేస్తే ఇప్పుడు 65 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. 60 శాతం ఉన్న ఆక్యుపెన్సీ ఇప్పుడు 97 శాతంకి పెరిగింది. ఆర్థిక విధ్వంసం తరువాత ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ఆర్టీసీకి ఈ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అండగా ఉంటుంది. ఈరోజు 97 బస్సు డిపోలు, 324 బస్ స్టేషన్లలో 200 కోట్ల మహిళా ఉచిత ప్రయాణాలు 6680 కోట్ల రూపాయల విలువైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు నిర్వహిస్తున్నాం అని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు.

# తెలంగాణ స్థానికతపై సుప్రీంలో విచారణ

**పరిష్కారం వెదకాలని ప్రభుత్వానికి ఆదేశం**

**న్యూఢిల్లీ,జూలై23(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ స్థానికత వివాదానికి పరిష్కారం వెతకాలని.. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దని తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణని ఆగస్టు 5వ తేదీకి వాయిదా వేసింది. నీట్ పరీక్ష రాయడానికి ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివితేనే స్థానికత వర్తిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఈ నిబంధనలు చెల్లవంటూ తెలంగాణ హైకోర్టు గతేడాది తీర్పు వెల్లడించింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం సవాలు చేసింది. గతేడాది మాత్రం పిటీషనర్లకు ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. ఈ ఏడాది తమకు కూడా స్థానికత నిబంధనల నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ సుప్రీంకోర్టులో విద్యార్థులు పిటిషన్లు దాఖలు చేశారు. తెలంగాణలో పుట్టి పదో తరగతి వరకు చదివినా స్థానిక కోటా దక్కడం లేదని పిటీ-షన్‌లో పేర్కొన్నారు విద్యార్థులు. 11, 12వ తరగతులు చదవని కారణంగా నీట్‌లో స్థానిక కోటా దక్కక నష్టపోతున్నామని తెలంగాణ విద్యార్థులు సుప్రీంకోర్టుకి వివరించారు. ఈ మేరకు సమస్యకు పరిష్కారం చూపాలని, విద్యార్థులను ఇబ్బందులు పెట్టొద్దంటూ తెలంగాణ ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానం సూచిస్తూ విచారణ వాయిదా వేసింది.

## సంపాదకీయం

# నేతల ఆర్థిక అవినీతికి చెక్ పెట్టేదెలా?

తెలుగు రాష్ట్రాల్లో అప్పులు చేసిన నేతలను తిడుతూ పోతున్న ప్రస్తుత సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు లు కూడా అప్పులనే ఆశ్రయిస్తున్నారు. అప్పులతోనే పాలన సాగిస్తున్నారు. ఆర్థిక నియంత్రణ లేకుండా పోతోంది. దుబారా ఖర్చులు విపరీతంగా ఉన్నాయి. వారి రక్షణకు విపరీతంగా ఖర్చు చేస్తున్నారు. దీనికి తోడు జీత భత్యాలు కూడా విపరీతమే. ఎమ్మెల్యేలు, మంత్రులు ఇతరలు జీతభత్యాలు కూడా లెక్కకు మిక్కిలి ఖర్చు చేస్తున్నారు. వీటిని తగ్గించే ప్రయత్నాలు లేవు. ఇక ఓట్ల కోసం ఉచిత పథకాలను కొనసాగిస్తున్నారు. ఇవన్నీ ఆలోచిన చేసి, ఖర్చులు తగ్గించుకోవాలన్న ప్రయత్నం జరగడం లేదు. ఇద్దరు సిఎంల ధోరణి ఇలాగే ఉంది. గతంలో పనిచేసిన కెసిఆర్, జగన్‌లు కూడా ఇంతకు మించి అన్నట్లు ప్రజాధనాన్ని దుబరా చేశారు. వేలకోట్లు వెనకేసుకున్నారు. నష్టపోతే పోయేది ప్రజలే అన్న ధోరణిలో పాలన సాగించారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు విపక్షంలో ఉన్న బిఆర్‌ఎస్, వైకాపాల తీరు ఒక్కటిగానే ఉంది. ప్రభుత్వంలో ఉండగా అలానే ఉండేది. ఇద్దరి మనస్థత్వాలు ఒక్కటే అన్నది మెల్లగా ఇప్పుడు జనాలకు అర్థం అవుతోంది. అధికారంలో ఉండగా అడ్డూ అదుపు లేకుండా వ్యవహరించారు. నియంతృత్వ పోకడలతో ప్రజాధనాన్ని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు పెట్టారు. నియంతల్లా పాలించారు. చరిత్రలో నియంతలను చూడకున్నా.. ఎలా ఉంటారో ఈ ఇద్దరినీ చూసిన వారికి అర్థం అయివుంటుంది. తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని నయా నియంతలా వ్యవహరించిన కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసి, వ్యవస్థలను భ్రష్టు పట్టించి.. ఇప్పుడు ఎదురుదాడి విమర్శలతో తప్పులను కప్పి పుచ్చుకునేందు తంటాలు పడుతున్నారు. అందుకే అధికార రుచి మరిగిన ఈ ఇద్దరూ ..మరోమారు అధికారంలో ఉండేలా పథకాల రచన చేసి రాష్ట్రాలను దోచేశారు. ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసి రాష్ట్రాలను దివాళా తీయించారు. పథకాల పేరుతో నగదును దోచి పెట్టారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాల రూపకల్పనతో నగదు బదిలీలు చేశారు. అభివృద్ధి పేరుతో అప్పులు చేసి సంపద సృష్టించామని గొప్పలు చెప్పారు. ప్యాలెస్‌లు కట్టుకున్నారు. సిఎం క్యాంప్ కార్యాలయం, సచివాలయం పేరుతో కెసిఆర్ దుబారాకు తెరలేపారు. కాళేశ్వరంతో రాష్ట్రాన్ని దివాళా తీయించారు. ఇక జగన్ విశాఖలో రాజప్రాసాదాలు నిర్మించుకున్నారు. ఎల్లప్పుడూ తమదే అధికారం అని విర్రవీగారు. పేదవాడికి ఓ చిన్న ఇల్లుకు నానా తంటాలు పడ్డా, తమకు మాత్రం రాజప్రసాదాలు కావాలని భావించారు. ఇంతగా డబ్బును వినియోగించి, ప్రజల చెమటను విలాసాలకు ఉపయోగించేశారు. కరిమింగిన వెలగపండులా ఇప్పుడు పరిస్థితి అంతా డొల్లగా మారింది. ఇద్దరూ అధికారం కోల్పోయాక కానీ అసలు విషయం ప్రజలకు కూడా తెలియలేదు. ఎంతగా అంటే రాష్ట్రం కోలుకోలని విధంగా అప్పులు చేశారు. ఈ అప్పులను తీర్చడమెలా అన్నది పక్కన పెట్టిన రేవంత్, చంద్రబాబులు ఉచిత పథకాలను కొనసాగిస్తూనే ఉన్నారు. వ్యక్తిగత దుబారాను తగ్గించు కోవడం లేదు. హెలికప్టర్లు, ప్రత్యేక విమానాల్లో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఇక అప్పులు చేసి రాష్ట్రాలను దివాళా తీసిన బిఆర్‌ఎస్, వైకాపా నేతలు..మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిందన్న సామెతలా..చేసిన తప్పులన్నీ చేసి, ఇప్పుడేమో నానాయాగీ చేస్తున్నారు. ఎపిలో అక్రమాలు, అహింస రాజ్యమేలు తున్నాయని జగన్ గగ్గోలు పెడుతున్నారు. పోలీస్ అధికారులపై జులుం ప్రదర్శించడం కూడా జరిగి పోయాయి. పరామర్శల పేరుతో నానా హంగామా సృష్టించారు.తనకు విపక్ష హోదా ఇవ్వడానికి భయపడుతున్నారని కూడా విమర్వలు చేస్తున్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా హుందాతనం ప్రదర్శించడంలో కెసిఆర్ ఆయన పరివారం, ఇటు జగన్ ఆయన పరివారం విఫలం అయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత అప్పట్లో పరిస్థితులు ఎలా ఉండేవో ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలకు అర్థం అవుతోంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇంతగా ఎందుకు దిగజారిపోయారా అని అనుమానం కలుగుతోంది. ఎపిలో జగన్ అధికారంలో ఉండగా ఒక రకమైన భయానక వాతావరణం ఉండింది. బయటకు విమర్శలు చేస్తే....యూ ట్యూబర్లపైనా కేసులు పెట్టి వేధించిన ఘటనలు చూశాం. ప్రజలంతా భయం గుప్పిట్లో బతికారు. జగన్‌తో పాటు ఆయన కోటరీలో ఉన్న వారి వల్ల అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూసింది. తెలంగాణలో కూడా అధికార వ్యవస్థ భ్రష్టుపట్టి పోయింది. ఫోన్ ట్యాపింగ్‌తో ప్రత్యర్థుల ఫోన్లను ట్యాప్ చేశారు. అధికార దుర్వినియోగం విపరీతంగా సాగింది. ప్రగతి భవన్ పేరిట ప్యాలెస్‌ను పోలిన భవనాన్ని నిర్మింపజేసి అందులో నుంచి కాలు బయటపెట్టకుండా కనుసైగలతో రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. అయినా ఆయనతో పాటు కొడుకు, అల్లుడి తీరులో మార్పు కనిపించడం లేదు. పాశ్చాత్తాపం కానరావడం లేదు. బటన్లను నొక్కడం వల్ల మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ నమ్మి అడ్డగోలు పనులు చేశారు. అందుకే జగన్‌ను జనం కసిగా ఓడించినా.. కారణాలు తెలుసుకోలేక పోతున్నారు. ఆత్మవిమర్శల చేసుకోవడం లేదు. రోడ్డెక్కి నానా హంగామా చేయాలని చూస్తున్నారు. అందుకే ప్రజలతో పాటు, అణచివేతకు గురైన నేతలు తమకు ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ పగ తీర్చుకోవాలని రగిలిపోతున్నారు. సొంత చెల్లెళ్లు వైఎస్ షర్మిల, డాక్టర్ సునీతలు చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పడం లేదు. చేసిన తప్పులను పక్కన పెట్టిన బిఆర్‌ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావు, కవితలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పార పట్టే పనిలో పడ్డారు. గత ఐదేళ్ల పాలనా అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కెసిఆర్, జగన్‌లు తమ విధానాలు మార్చుకోవాలి. పాశ్చాత్తాపం ప్రకటించాలి. పాలకుల అవినీతిపై ఖచ్చితంగా విచారణ జరగాలి. శిక్షలు పడాలి. అందుకు ఇప్పుడున్న వ్యవస్థలో సాధ్యం కాదు. లోక్‌పాల్ వంటి వ్యవస్థను ఏర్పాటు చేస్తేనే పాలకుల అవినీతిని అరికట్టగలం. అక్కడే సమగ్ర విచారణ జరగగలదు. ఈ విషయంలో ప్రజలంతా లోక్‌పాల్ కోసం ఉద్యమించాలి. రాజకీయ అవినీతిపై ప్రజలే యుద్ధం చేయాలి.

## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

**మొత్తం రూ.69 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం**
**హైదరాబాద్ సిపి సివి ఆనంద్ వెల్లడి**

**హైదరాబాద్,జూలై23(జై భీమ్ న్యూస్):**


హైదరాబాద్‌లో మరోసారి పోలీసులు భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. డ్రగ్ విక్రయిస్తున్న తొమ్మిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కొకైన్ సరఫరా చేస్తున్న ఆరుగురు, మెఫిడ్రీన్ సరఫరా చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. హైదరాబాద్ సిపి సివి ఆనంద్ మీడియాతో మాట్లాడారు... ప్రేమ్ ఉపాధ్యాయ్ అనే వినియోగదారుడిని పట్టుకోవడంతోనే డ్రగ్ ముఠాగుట్టు రట్టు అయిందని, నిందితుల నుంచి మొత్తం రూ.69 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. డ్రగ్స్ కేసులో రవి వర్మ, సచిన్ అనే ఇద్దరు కీలక వ్యక్తులను పట్టుకున్నామని, ఈ ఇద్దరి నుంచి కీలకమైన సమాచారం సేకరించామన్నారు. రవివర్మకు ముంబయికి చెందిన ముఠాతో సంబంధాలు ఉన్నాయని, ముంబయిలో వాహిద్ అనే వ్యక్తికి విదేశాల నుంచి కొకైన్ వస్తుందని, ముంబయిలోని వాహిత్ నుంచి నిందితులు హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకవస్తున్నారని ఆనంద్ పేర్కొన్నారు. నిందితుల నుంచి 286 గ్రాముల కొకైన్, 11 గ్రాముల ఎక్స్‌టసీ, తుపాకీ, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలను సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.కాటేదాన్‌లో డ్రగ్స్ దందా చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన పవన్ భాటీ-ని కూడా అరెస్ట్ చేశాం. హేమ్‌సింగ్ అనే మరో వ్యక్తితో కలిసి పవన్ భాటీ- డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. నిందితులు ముందు జాగ్రత్తగా రివాల్వర్, బుల్లెట్లు- కూడా కొనుగోలు చేశారని సీపీ వివరించారు.

# స్థానిక నేతలకు 'సోయి' లేదు

మొదటి పేజీ తరువాయి

పూర్తిగా వికలమవుతుందన్నారు.ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు నిజాయితీని ప్రదర్శించి ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులను నిర్ధారించిన ఫీజులతో కొనసాగించగలిగితే విద్యార్థి సంఘాలు ధర్నాలు ఎందుకు చేయవలసిన పరిస్థితి ఏర్పడతాయన్నారు.ప్రైవేటు యూనివర్సిటీలను పెంచి పోషిస్తున్న ప్రభుత్వం ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను పూర్తిగా నిర్వీర్యం చేసే స్థాయికి నెట్టివేస్తుందన్నారు.ఒకవైపు గురుకుల విద్యాసంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తూనే ప్రభుత్వ పాఠశాల విద్యా స్కూళ్లను బలోపేతం చేస్తున్నామని నిధులు కేటాయించకుండా అవస్థలు పెడుతున్నారన్నారు.విద్యాసంస్థలను రక్షించుకోవడం కోసం నిరంతరంగా పోరాటాలు చేస్తున్న విద్యార్థుల పట్ల ప్రభుత్వము ప్రభుత్వ సంబంధించిన నేతలు పోలీసు అధికారులను ఉసిగొలుపుతూ క్రూరంగా ప్రవర్తిస్తుండడం విచారకరమన్నారు.ప్రైవేట్ విద్యాసంస్థలలో జరుగుతున్న అవినీతి నిలువు దోపిడిని కట్టడి చేయాల్సిన ప్రభుత్వాలు పేద విద్యార్థుల రక్షణ కోసం పోరాటాలు చేసిన విద్యార్థి సంఘాల నేతలను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అణిచివేస్తూ నిర్బంధిస్తూ లెక్కలేనంతగా ఇబ్బందులు పెడుతున్నారన్నారు.ప్రైవేట్ విద్యాసంస్థలను పరుగులు పెట్టిస్తూ,ఉరుకుల పెట్టిస్తూ అనుమతుల విషయంలో గాని ఫీజుల వసూళ్ల విషయంలో గాని విద్యార్థులకు న్యాయం చేసే విషయంలో గాని ఎక్కడ తలొగ్గకుండా తెలంగాణ ఉన్నత విద్యా మండలి సంస్థ పేద విద్యార్థులకు పేద ప్రజలకు పేద కుటుంబాలకు పెద్దదిక్కుగా నిలుస్తూ తగిన న్యాయం చేస్తుందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యాసంస్థలకు రావలసిన విద్యార్థుల పాత ఫీజుల బకాయిలను తెప్పించాల్సిన స్థానిక నాయకులు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రతి నియోజకవర్గానికి ఒకటి తెప్పించి నిర్మాణాలు చేపడుతూ విద్యాభివృద్ధిని కొనసాగిస్తున్నామని కాంట్రాక్టు డబ్బుల కోసం పాకులాడుతున్నారన్నారు. అసలు కైతే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఎవరికోసం స్థాపిస్తున్నారో నాయకులకే పొంతనలేదన్నారు.ప్రభుత్వాలు మారినా విద్యార్థుల బతుకులు మాత్రం మారడం లేదన్నారు.ప్రజా పాలనకు, పేద విద్యార్థుల బతుకులకు మధ్య అత్యంత వ్యత్యాసం ఉందన్నారు. పరువు తీస్తున్న విద్యాశాఖ అధికారులు. కార్పోరేట్ విద్యాసంస్థలను పెంచి పోషిస్తూ ప్రభుత్వ విద్యపై కన్నేర చేస్తున్నారన్నారు.కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించకపోవడంలో మతలాబు ఏమిటని? సూటిగా ప్రశ్నించారు.ప్రైవేట్ యూనివర్సిటీల బలోపేతం విద్యా వ్యాపారం కోసమేనా?అంటూ నిలదీశారు. విద్యార్థులు అంటేనే చీదరించుకుంటున్న విశ్వవిద్యాలయ అధికారులు అవినీతి సొమ్ము సంపాదనకు మరిగారన్నారు.ప్రభుత్వం చెప్పేదొకటి చేసేది మరోకటంటూ ప్రజాపాలనలో ఎవరిష్టం వాళ్ళదేనన్నారు.ప్రసార మాధ్యమాల్లో కొనసాగుతున్న హుషారైన పరిపాలన మౌఖికంగా కనిపించడం లేదన్నారు.20 నెలలు కావస్తున్న ఇంకా మెరుగుపడని ప్రభుత్వ విద్యపట్ల శ్రద్ధ చూపలేకపోతున్నారన్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ మినహాయిస్తే ప్రభుత్వ విద్యలో అంతా డొల్లేనంటూ.విద్యార్థులను వేధిస్తున్న అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు.ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తూ పేదపేద విద్యార్థులను ఇబ్బంది పెడుతుండగా పేద విద్యార్థుల విద్యా బలోపేతం కోసం ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల నియంత్రణ కోసం విద్యార్థి సంఘాల నాయకులు నిరుద్యోగ యువత విస్తృతంగా నిరసన ధర్నాలు పోరాటాలు చేస్తుండగా అదే క్రమంలో బంద్ కు పిలుపునిచ్చిన విద్యార్థులను మానసికంగా వేధించి కిరాతకంగా అరెస్టులు చేసి కుటుంబాలకు సమాచారం ఇవ్వకుండా రహస్య ప్రాంతాల్లో నిర్బంధించిన పోలీసులను కఠినంగా శిక్షించాలన్నారు.ఖాకి చొక్కా ఒంటిమీద ఉన్నదనే అహంకారంతో ప్రైవేట్ ఏజెన్సీ కన్నా అద్వానమైన స్వభావాన్ని ప్రదర్శిస్తున్న కొంతమంది కిందిస్థాయి పోలీస్ అధికారులు వాళ్ల స్వభావం మార్చుకొని నాయకుల కోసం కాకుండా పేద విద్యార్థులకు అండగా నిలవాలని సూచించారు.కాంట్రాక్ట్ పనులకు వేల లక్షల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల పట్ల మొండి వైఖరిని ప్రదర్శిస్తుందన్నారు. విద్యాశాఖ మంత్రి ఇలాకలో పేద విద్యార్థులు బోలేడు బాధలుపడుతున్నారన్నారు. గురుకులాలను మూసివేసే కుట్రలో ప్రభుత్వ అధికారులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.అంగరక్షకుల అండతో విర్రవీగుతున్న రాజకీయ నేతలు పేద విద్యార్థులకు న్యాయం చేయాల్సింది పోయి "సోయి" లేకుండా ప్రవర్తిస్తున్నారన్నారు. ప్రజాసేవంటే పైసా సంపాదనా, ప్రజా సంక్షేమమా?ప్రభుత్వం ప్రభుత్వ నాయకులు తేల్చుకోవాలన్నారు.ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రణకు పాతబకాయిల ఫీజుల మంజూరుకు విద్యార్థి సంఘాలు చేస్తున్న పోరాటాలు వృధా కాకూడదని ప్రజా సంఘాలు మేధావి సంఘాలు పాత్రికేయ సంఘాలు నిరుద్యోగ సంఘాలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయన్నారు. ఇదే అదునుగా భావిస్తూ భూ కబ్జాదారుల మెప్పుకోసం సామాన్య విద్యార్థులను వేధిస్తున్న నాయకులు, పోలీసులు లేకపోలేదన్నారు.20 నెలలుగా విద్యార్థి సంఘాల నేతలు పాత ఫీజుల బకాయిల కోసం నిరంతర పోరాటాలు చేస్తున్నప్పటికిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వ సంక్షేమంగా భావించి తక్షణమే పాత ఫీజుల బకాయిలను చెల్లిస్తూ ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవడంతో పాటు ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రైవేటు యూనివర్సిటీల ఫీజుల నియంత్రణను తక్షణమే అమలు పరచాలని డిమాండ్ చేశారు.పేద విద్యార్థులకు న్యాయం జరిపించడం కోసం జై భీమ్ సంస్థ విద్యార్థులు తలపెడుతున్న పలుపెరుగని పోరాటాలకు సహాయంగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

# దత్తాత్రేయను ఉప రాష్ట్రపతి చేయాలి



**తెలంగాణ నేతలకు బిజెపి అన్యాయం చేస్తోంది**
**ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా విచారకరం**
**ఢిల్లీ మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి డిమాండ్**

**న్యూఢిల్లీ,జూలై23(జై భీమ్ న్యూస్):**

బిజెపికి చిత్తశుద్ధి ఉంటే బండారు దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలని సిఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీఅయిన స్థానంలో బిసి అయిన దత్తాత్రేయకు ఛాన్స్ ఇవ్వాలని అన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓబీసీలకు న్యాయం చేయాలని భాజపాని కోరుతున్నానని అన్నారు. కేంద్ర పదవుల్లో తెలంగాణకు, బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. గతంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేతను తొలగించారు. ఇప్పటికే దత్తాత్రేయను గవర్నర్ పదవి నుంచి తొలగించారు. బీసీ అయిన దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎంతో పార్లమెంటరీ అనుభవం ఉన్న నేతగా దత్తాత్రేయకు పేరుందన్నారు. ఆయన సమర్థుడైన నేత అని, తెలంగాణకు చెందిన బిసి నేతగా ఆయనకు అవకాశం ఇవ్వాలని అన్నారు. ఇకపోతే కులగణన సర్వేలో వ్యక్తుల వ్యక్తిగత వివరాలను వెల్లడించలేదు. 3.99 శాతం మంది తమకు ఏ కులం లేదని చెప్పారు. స్వతంత్ర నిపుణుల కమిటీ- ఇచ్చిన నివేదిక ప్రకారమే మేం ముందుకెళ్తున్నాం. బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని కుట్ర చేస్తున్నవారే సందేహాలు లేవనెత్తుతున్నారు. కులగణన సర్వే డేటా కావాలంటే ఆయా పార్టీల ముందు, అసెంబ్లీలో ప్రవేశపెడతాం అని సిఎం అన్నారు. మేం కల్పించే రిజర్వేషన్లలో మతం ప్రస్తావనే లేదు. ముస్లింల పేరుతో మరోసారి భావోద్వేగ రాజకీయాలు చేయాలని భాజపా చూస్తోంది. మూడు రైతు వ్యతిరేక చట్టాల విషయంలో ఏం జరిగిందో అందరూ చూశారు. రైతు చట్టాల రద్దు స్ఫూర్తిగా బీసీ రిజర్వేషన్ల చట్టం ఆమోదం కోసం పోరాడుతాం అన్నారు. 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో 50శాతం నిబంధన దాటిపోయింది. దాని విషయంలో అడ్డురాని నిబంధన బీసీల విషయంలో ఎందుకు వస్తోందని సిఎం ప్రశ్నించారు. జగదీప్ ధన్కడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవి కోసం త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. అందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఈ అంశంపై తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు.జగదీప్ ధన్కడ్ రాజీనామా బాధాకరమన్నారు. ఉపరాష్ట్రపతి పదవి తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న వెంకయ్య నాయుడును వెనక్కి పంపించారన్నారు. ఎన్డీయే తెలంగాణలో ఉన్న బీసీలకు అన్యాయం చేసిందని.. ఎన్డీఏ దత్తాత్రేయ, బండి సంజయ్‌ల గొంతు కోసిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉపరాష్ట్రపతి పదవి దత్తాత్రేయకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం నిలబెట్టాలన్నారు. 2029 లో పార్లమెంట్ ఎన్నికలకు ఓబీసీ ఇరిర్వేషన్లు లిట్మస్ టెస్ట్ అవుతాయి. ఓబీసీలకు న్యాయం చెయ్యడానికి బీజేపీ సర్కార్ సిద్ధంగా లేదు. ఏ బిల్లు పంపినా క్లారిఫికేషన్ అడుగుతారు.. రిజర్వేషన్ల బిల్ పై క్లారిటీ- అడిగారు. వాళ్ళు అడిగిన దానికి క్లారిటీ ఇచ్చామని సీఎం తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ వ్యవహరిస్తోన్న తీరుపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో బీజేపీ ద్వంద వైఖరి అవలబిస్తోందని.. అసెంబ్లీలో బిల్లుకు ఆమోదం తెలిపి.. పార్లమెంట్‌లో అడ్డుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లపై బిల్లులపై బీజేపీ తెలంగాణ చీఫ్ రామచందర్ రావు వితండవాదం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మీరు ఇచ్చిన హామీని మీరే అమలు చేసుకోవాలని ఆయన అంటు-న్నారు.. కానీ కాంగ్రెస్ కు ఓ రాజ్యాంగం, బీజేపీకి ఓ రాజ్యాంగం ఉండదని చురకలంటించారు. బీజేపీ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లలో ముస్లిం కోటా తొలగిస్తే బీసీ బిల్లులకు మద్దతిస్తామని కేంద్రమంత్రులు అంటున్నారు. మరీ మహారాష్ట్ర, ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఎప్పటి నుంచో బీసీ రిజర్వేషన్లలోనే ముస్లింలకు కోటా ఉందన్నారు. దమ్ముంటే అక్కడ తొలగించి.. తర్వాత తెలంగాణ గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు. బీజేపీ వైఖరి ముస్లిం కోటాను అడ్డుకునే కుట్రగానే మేం భావిస్తున్నామన్నారు. బీసీ బిల్లులకు ఆమోదం తెలపకుండా సాకులు వెతుకుతున్నారని.. ముస్లిం కోటాను అడ్డంపెట్టి బీజేపీ నేతలను బీసీ బిల్లులను అడ్డుకుంటున్నారని విమర్శించారు. కేంద్రం బీసీ బిల్లులు ఆమోదించేలా విపక్షాన్నింటినీ ఏకం చేస్తామన్నారు.



## భారీ వర్షాల కారణంగా పోలీస్ వారు

**అవసరముంటేనే ఇంటి నుండి బయటకు రావాలి**
**కన్నాయిగూడెం ఎస్సై ఇనిగాల వెంకటేష్**

**కన్నాయిగూడెం, జై భీమ్ న్యూస్**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ప్రజలకు మరియు రైతులకు మా పోలీసు వారి నుండి చేయు ముఖ్య సూచన ఏమనగా రానున్న రెండు మూడు రోజుల్లో మన ప్రాంతానికి విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నందున అవసరముంటే మాత్రమే ఇంటి నుండి బయటకు రావాలని కరెంటు స్తంభాలు పక్కన ఉన్న తీగలును మరియు ఐరన్ తీగలు పొరపాటున ముట్టుకోవద్దు మరియు తీవ్ర వర్షాలు కారణంగా ఎవరు అయినా పాత ఇంట్లో నివసిస్తుంటే ఈ వర్షానికి నాని కూలెందుకు అవకాశం ఉన్నందున ఈ ఇళ్లను ఖాళీ చేయగలరు తీవ్రమైన వర్షం వలన వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నందున లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అట్టి ప్రాంతాల్ని ఖాళీ చేసి సురక్షిత ప్రదేశాలకి వచ్చి ఉండాలని అనవసరంగా వాగులుని దాటవద్దు ఎక్కడైనా రోడ్ల మీదకి నాళాలు పొంగి ప్రవహిస్తుంటే దాని పైనుండి ఎవరు దాటవద్దు అలాగే అలా ప్రవహిస్తున్న నాళాల గురించి,అత్యవసరం ఐతే కన్నాయిగూడెం పోలీస్ వారి ప్రత్యేక బృందాలు 24గంటలు అందుబాటులో ఉంటారు కావున కన్నాయిగూడెం పోలీస్ వారికి సమాచారం ఇవ్వాల్సిన ఫోన్ నెంబర్లు కన్నాయిగూడెం ఎస్ఐ 8712670089 కన్నాయిగూడెం పోలిస్ స్టేషను నంబర్ 8712670139 ఇవ్వాలని అన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హసన్‌పర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్**





**హన్మకొండ జిల్లా (హసన్ పర్తి) జై భీమ్ న్యూస్**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలని సేవలందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపి విభాగాన్ని పరిశీలించి అక్కడ ఉన్న పేషెంట్స్ తో కలెక్టర్ మాట్లాడి ఆరోగ్య కేంద్రం ద్వారా అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీని సందర్శించి మందుల నిల్వలను అడిగి తెలుసుకున్నారు. ఈ-ఔషధి పోర్టల్ లో ఫార్మసికి కావాల్సిన మందులను ఎలా ఇండెంట్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉప కేంద్రాలకు మందులను ఏ విధంగా అందిస్తున్నారనే వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్సిడి కార్యక్రమంలో బీపీ, షుగర్ లాంటివి ఏ విధంగా స్క్రీనింగ్ చేస్తున్నారని, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులను ఏ విధంగా అందుతున్నాయి అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తొలగింపు ప్రతిపాదనలో ఉన్న ఆరోగ్య కేంద్రంలోని పేషంట్ వార్డ్, థియేటర్లను కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ ను పరిశీలించి నమూనాలను ఏ విధంగా సేకరిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రమైన వాతావరణము ఉండాలని, నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. అవసరమైన మందులు అన్ని ఫార్మసీలో అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, మండల యు.పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ రామ్ భార్గవ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**పలు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలు ఆరా తీసిన కలెక్టర్**

**హన్మకొండ జిల్లా (హసన్ పర్తి) జై భీమ్ న్యూస్**



హసన్ పర్తి మండలం చింతగట్టు క్యాంపు సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీకి సంబంధించిన పళ్ళు రికార్డులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యాలయానికి నిత్యావసర సరకుల సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు, ఇతర నిత్యావసర సరకులను తాజాగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. విద్యార్థినులకు తయారు చేసిన భోజన పదార్థాలను కలెక్టర్ పరిశీలించారు. డైనింగ్ హాలులో పాఠశాల విద్యార్థినులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. విద్యార్థినుల కోసం వండిన భోజనం బాగుందని మెచ్చుకున్నారు. అనంతరం విద్యాలయంలో ఆటలు ఆడుకోవడానికి స్పోర్ట్స్ మెటీరియల్ ఉందా అని, ఆటలు ఆడుతున్నారా అని కలెక్టర్ విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్ రికార్డ్స్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి, పాఠశాల ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# ప్రైవేటు విద్యారంగంపై ఉన్న ప్రేమ ప్రభుత్వ విద్య పైన ఉండదా?

**ఫీజుల చట్టం అమలు ఉండదు ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ ఉండదు**

**తెలంగాణలో విద్యాశాఖను గాలికి వదిలివేసిన రేవంత్ ప్రభుత్వం 18 నెలలు గడుస్తున్న విద్యాశాఖ మంత్రిని కేటాయించారా?**

**మధ్యాహ్న భోజనానికి నిధులు ఇవ్వరు, మౌలిక సదుపాయాలు లేవు, గురుకులాలలో ఒరిస్సా ఘటనలు జరుగుతున్న ప్రభుత్వ స్పందన కరువు**

**పెండింగ్ ఫీజులు తక్షణమే విడుదల చేయాలి**

**వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ విజయవంతం**

**సమస్యలు పరిష్కారనీకై చేపట్టిన చలో సచివాలయం ముట్టడి**

**ఉద్రికత విద్యార్థి నేతల అక్రమ అరెస్టులు**

**అక్రమ అరెస్టులను నిరసనగా రేపు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ దిష్టి బొమ్మల దగ్ధం పిలుపు**




**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగ సమస్యలు, ప్రైవేటు కార్పోరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ కై ప్రత్యేక చట్టం చేయాలని, పెండింగ్ స్కాలర్షిప్ల ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల నిర్వహించిన పాఠశాలల ఇంటర్ కళాశాల బంద్ విజయవంతం అయింది. ఈ సందర్భంగా ఈ సమస్యలు పరిష్కారానికి నిర్వహించిన చలో సచివాలయం ఉద్రిక్తతకు దారితీసింది. సమస్యలు పరిష్కారానికి లోయర్ ట్యాంక్ బండ్ నుండి ప్రదర్శనగా బయలుదేరిన విద్యార్థి నేతలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పిడి గుద్దులతో బలవంతంగా,అమ్మాయిల సైతం చూడకుండా లాక్కుని పోలీసులు వ్యాన్లలో ఎక్కించి ముషీరాబాద్ బోయిన్ పల్లిలో పాటు నగరంలో పలు పోలీస్ స్టేషన్ లో తరలించారు ఈ సందర్భంగా విద్యార్థి నేతలకు పోలీసులకు తీవ్ర తోపులాట జరిగింది వాగ్దానం జరిగింది. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు పుట్ట లక్ష్మణ్, కె.మణికంఠ రెడ్డి (ఏ.ఐ.ఎస్.ఎఫ్) టీ.నాగరాజ్, రజనీకాంత్ (ఎస్.ఎఫ్.ఐ) సాయిబోల అనిల్ (పి.డి.ఎస్.యు) పొడపంగి నాగరాజు, (పి.డి.ఎస్.యు), గడ్డం నాగార్జున, పల్లె మురళి (ఎ.ఐ.ఎఫ్.డి.ఎస్) హాకీం నవీద్ (ఏ.ఐ.ఎస్.బి) నితీష్(ఏ ఐ డి ఎస్ ఓ), మనే కుమార్ (ఏ.ఐ.పీ.ఎస్.యు), మొగిలి వెంకట రేడ్డి (పి.డి.ఎస్. యు)లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం వైఫల్యాల ఎండగడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు అవుతున్న విద్యారంగానికి ఇచ్చిన హామీల నెరవేర్చలేదు. రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని పరోక్షంగా అమలు చేస్తూ ఈ రాష్ట్ర విద్యా రంగాన్ని బిజెపి చేతిలోకి పెట్టే కుట్రలు చేస్తుంది. రాష్ట్రంలో 2253ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీటి సౌకర్యం లేదు, 1500 పైగా పాఠశాలలో టాయిలెట్స్ లేవు, 28 వేల పైగా పాఠశాలలో కంప్యూటర్స్ లేవు, ఇంగ్లీష్ మీడియం ఇతర రాష్ట్రాల మీడియాలో మాదిరి కన్నడ ఉర్దూ మలయాళం చదువుతున్న విద్యార్థులకు రావాల్సిన పాఠ్యపుస్తకాలు అందలేదు రెండు జతలు యూనిఫామ్స్ ఇవ్వాల్సిన ప్రభుత్వం ఒక జత మాత్రమే ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేసి నారూ. ఇంకా 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. గత ప్రభుత్వం పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్ పథకం తీసుకొచ్చిన దానిని అమలు చేయడం లేదు, మధ్యాహ్నం భోజనానికి పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు ఇవ్వాల్సిన ఉన్న వాటిని పెంచడం లేదు, లైబ్రరీలు, త్రాగునీరు , ప్రహరీ గోడలు, టాయిలెట్స్ అదనపు గదులకు నిధులు ఇవ్వలేదు, పాఠశాల విద్యా రంగం తీవ్ర సంక్షోభంలో నెట్టి వేయబడింది. ప్రైవేటు,కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీకి అడ్డు అదుపు లేదు ఎల్కేజీ నుండి లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారు. అడ్మిషన్లు పేరుతో డొనేషన్లు పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్ అమ్మతో లక్షల రూపాయల దందా కొనసాగిస్తున్న ప్రభుత్వం నియంత్రం లేదు. రాష్ట్రంలో తక్షణమే ఫీజు నియంత్రణ కోసం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నాం. గురుకులల్లో కనీసం సౌకర్యాలు లేవు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాతవరుసగా 93 మంది చనిపోయినారు. దీనికి కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చేయడం లేదు గురుకులల్లో ఆ శాస్త్రీయంగా తీసుకొని వచ్చిన సమయపాలన మార్చాలి అద్దెభవనలు నడుస్తున్న 662 గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయడంలోను తీవ్ర నిర్లక్ష్యం చేస్తుంది. తక్షణమే ఫీజు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం ఇంటర్ విద్యాలో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ లెక్చరర్స్ పోస్టులు భర్తీ చేయాలి. పాఠశాల విద్యాలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, డీఈఓ పోస్టులను తక్షణమే భర్తీచేయాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పరీక్షంగా ఎన్ఈపి 2020 ను అమలు చేస్తున్న రేవంత్ రెడ్డి, ఎన్ఈపి 2020 అమలు చేయకుండా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తుంది. విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించి బడి బస్సులు నడపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకుంటే భవిష్యత్తులో తీవ్ర ప్రతిఘటనలు రేవంత్ ప్రభుత్వం ఎదురుకోవాల్సి వస్తుందని అన్నారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి దగ్గరే విద్యా శాఖ ఉన్నప్పటికీ కనీసం ఒక రివ్యూ కూడా చేయలేదని కనీసం ఒక విద్యా సంస్థను కూడా సందర్శనలేదని ప్రభుత్వ విద్యారంగా బలోపేతం కాకుండా ప్రైవేటు విద్యాసంస్థలను సందర్శిస్తున్నారని విమర్శించారు. బందు సందర్భంగా మంచిర్యాల భువనగిరి కొత్తగూడెం జిల్లాలో అక్రమంగా అరెస్టులు చేశారు. సచివాలయానికి వచ్చి మంత్రులకు సమస్యలు చెప్పాలని వస్తున్న విద్యార్థి నాయకులను అక్రమ అరెస్టు చేశారు. ఈ అక్రమ అరెస్టులను ఖండిస్తూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేయాలని విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సచివాలయం కార్యక్రమంలో ఎం.మమత, డి కిరణ్, అశోక్ రెడ్డి, రమ్య, నాగేందర్, స్టాలిన్, రజనీకాంత్, కైలాస్ (ఎస్.ఎఫ్.ఐ), చైతన్య, రెహమాన్, అనిల్ కుమార్, హుస్సేన్, అరుణ్, తేజ, నితీష్ (ఏ.ఐ.ఎస్.ఎఫ్), హరీష్, నాగరాజు, సాయి, ప్రసాద్ , బీమ్ సేన్, సోనీ, నవిత, క్రాంతి (పి.డి.ఎస్.యు), పి.మహేష్, శ్రీను ,శ్యామ్ ,గౌతమ్ (పి.డి.ఎస్. యు) శ్రీకాంత్, ప్రణయ్, వరుణ్ (ఏ.ఐ.ఎఫ్.డి.ఎస్) నాగరాజు, శశాంక్, సిద్దు(ఏ.ఐ.డి.ఎస్.ఓ) సూర్య కిరణ్ (ఏ.ఐ.ఎస్.బి) గణేష్, సైదులు, వంశీ, రాజు (పి.డి.ఎస్.యు), విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ అకాడమీ తీరుపై మండిపడ్డ జర్నలిస్టులు

**టీయూడబ్ల్యూజే పై ఆగ్రహం వ్యక్తం చేసిన వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్**

**ప్రెస్ అకాడమీ నిర్వహించే శిక్షణ తరగతులకు యూనియన్ మీ పేరు ఎందుకు..?**

**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు**

**తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో జర్నలిస్టుల ఆందోళన**



**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో విలేకరులకు పునఃశ్చరణ తరగతులను నిర్వహించాల్సి ఉండగా ఓ యూనియన్ స్వలాభం కోసం వారి సహకారంతో మిగతా జర్నలిస్టు సంఘాలను తప్పుదోవ పట్టిస్తు ఇంతకు దిగజారుతారా అని తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి చర్యలను వ్యతిరేకిస్తూ రంగారెడ్డి జిల్లా విలేకరులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. బుధవారం ప్రెస్ అకాడమీ కార్యాలయంలో వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు అక్కడికి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో విలేకరుల పునఃశ్చరణ తరగతులను టియుడబ్ల్యూజే యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు బ్యానర్ ఏర్పాటు చేయడం పట్ల మిగతా సంఘం నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ డౌన్ డౌన్, ఏకపక్ష నిర్ణయాలు నశించాలి అంటూ జర్నలిస్టులు తమ నినాదాలతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు మాట్లాడుతూ.. ప్రెస్ అకాడమీ చైర్మన్ నిర్ణయాన్ని ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న విలేకరుల పునఃశ్చరణ తరగతులను పియుడబ్ల్యూజే ఆధ్వర్యంలో వారి సహకారంతో జరుగుతున్నట్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం తగదన్నారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేస్తున్న ఇలాంటి కార్యక్రమాలను ఒక యూనియన్ కు ఆపాదిస్తూ ప్రచారం చేసుకోవడం తగదన్నారు. అదేవిధంగా కొంతమంది జర్నలిస్టులను మాత్రమే పిలుచుకొని వారికి అనుకూలంగా ఉన్నవారితో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం ఏమిటని ఫెడరేషన్ నాయకులు సైదులు ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లాలో 1100 మందికి అక్రిడేషన్ కార్డులు ఉండగా కొంతమందిని పిలుచుకొని తరగతిలో ఏర్పాటు చేసుకోవడం అర్థం ఏమిటని ప్రశ్నించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఇలాంటి నిర్ణయాలతో మిగతా జర్నలిస్టుల మనోభావాలను ప్రెస్ అకాడమీ దెబ్బతీయడం సమంజసం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులకు సుమారు 70 మందిని ఎంచుకోవడంలో ఆంతర్యం ఏమిటని మిగతావారు అక్రిడేషన్ జర్నలిస్టులు లేరా వారు శిక్షణ తరగతులకు పనికిరారా అని సైదులు ఘాటుగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా జరిగిన ఆందోళనలో పెస అకాడమీ చైర్మన్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చైర్మన్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన కొనసాగింది. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులతో పాటు రంగారెడ్డి జిల్లా ప్రముఖ దినపత్రిక జిల్లా బ్యూరో గణేష్ జిల్లా కమిటీ నాయకులు దేవేందర్ నరసింహారెడ్డి, షాద్ నగర్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్ గౌడ్ నరేష్, రాజేంద్రనగర్ మహేశ్వరం ఆమనగల్ ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని జర్నలిస్టులు ఈ ఆందోళనలో అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గవర్నర్ ఆదేశాలమేరకు హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీలో సమావేశం





**హనుమకొండ రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం**
**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**
**ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా 30 మందికి టిబి (క్షయ) వ్యాధిగ్రస్తులకు ఉచిత న్యూట్రిషన్ కిట్లు**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

గవర్నర్ ఆదేశాలమేరకు హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీలో బుధవారం సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు స్నేహ శబరీష్ ఐఏఎస్ పాల్గొన్నారు. కలెక్టర్ గారికి రెడ్ క్రాస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. ముందుగా రెడ్ క్రాస్ సొసైటీ లోని జనరిక్ మందుల షాప్, టైలరింగ్ శిక్షణ కేంద్రం, డే కేర్ సెంటర్ మంజూరి కొరకు సందర్శించి, తలసీమియా సెంటర్ ను సందర్శించి పిల్లలతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. తలసీమియా బాధితులకు పండ్లు పంపిణి చేసినారు. తలసీమియా వ్యాధిగ్రస్తులకు రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలకు పాలకవర్గాన్ని అభినందించారు. పిదప రెడ్ క్రాస్ లో రెడ్ క్రాస్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా 30 మంది టిబి (క్షయ) వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లు (పౌష్టకాహారం కోడిగుడ్లు సరుకులు), కిట్లు కలెక్టర్ మరియు పాలకవర్గం చేతులమీదుగా ఉచితముగా పంపిణి చేసినారు. ఈ నెల నుండి ఆరు నెలల వరకు ప్రతి నెల 30 మందికి న్యూట్రిషన్ కిట్లు అందచేస్తామని పాలకవర్గం తెలిపారు. అనంతరం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనియర్ మరియు యూత్ రెడ్ క్రాస్ కార్యక్రమాల గురించి అధికారులతో మీటింగ్ ఆరెంజ్ చేస్తాను అని తెలిపారు. అదేవిదంగా జీవితకాల సభ్యులను గురించి తెలుసుకుని సూచనలు చేసినారు. బ్లడ్ సెంటర్ లో భాగంగా రక్తదాన శిబిరాల గురించి, రెడ్ క్రాస్ నిధుల సమీకరణ గురించి ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదాన కార్యక్రమమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు తలసీమియా బాధితులకు చేస్తున్న సేవలకు రెడ్ క్రాస్ పాలకవర్గాన్ని అభినందించారు. రెడ్ క్రాస్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని తెలిపారు. సన్మానం:రెడ్ క్రాస్ పాలకవర్గం కలెక్టర్ ని శాలువా, షీల్డ్ తో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు డా. పి. విజయచందర్ రెడ్డి (చైర్మన్), పెద్ది వెంకట నారాయణ గౌడ్ (వైస్ చైర్మన్), బొమ్మినేని పాపిరెడ్డి (కోశాధికారి), ఈ.వి. శ్రీనివాస్ రావు (రాష్ట్ర పాలకవర్గ సభ్యులు), జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణు గోపాల్, డా. ఎం. శేషుమాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డా. కె. సుధాకర్ రెడ్డి, చెన్నమనేని జయశ్రీ, బిళ్ళ రమణ రెడ్డి, హనుమకొండ డిఎం అండ్ హెచ్ఓ ఎ. అప్పయ్య, జిల్లా టిబి (క్షయ) నివారణాధికారి కె. హిమబిందు మరియు రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ములుగులో ఘనంగా మహాలక్ష్మీ సంబురాలు

**ఉచిత బస్సు ప్రయాణ సంబురాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క**
**మహిళలకు ఇప్పటి వరకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు కల్పించిన ప్రజా ప్రభుత్వం**
**ఆర్టీసీ బస్సులో ప్రయాణించి ములుగు బస్టాండ్ కు చేరుకున్న సీతక్క**
**ప్రయాణ సమయంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణ అనుభావాలు తెలుసుకున్న సీతక్క**
**ములుగు బస్టాండ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా ప్రయాణికులకు స్వీట్లు తినిపించి సంబురాలు నిర్వహించిన మంత్రి సీతక్క**
**ఉచిత బస్సు ప్రయాణాన్ని విజయవంతం చేసిన ఆర్టీసీ సిబ్బందికి సన్మానం**

**ములుగు జిల్లా జై భీమ్ న్యూస్**

ఉచిత బస్సు ప్రయాన్ని అమలు చేస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు మహిళా ప్రయాణికుల తరుపున ధన్యవాదాలు తెలిపిన సీతక్క. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళలందరికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహిళలకు ప్రయాణ భారం లేకండా మహాలక్ష్మీ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఇప్పటి వరకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలను మహిళలు పూర్తి చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మహిళల ఉచిత ప్రయాణంతో రూ.6700 కోట్లు వారికి ఆదా అయ్యిందని..ఆ మొత్తాన్ని ఆడబిడ్డల తరుపున ప్రభుత్వమే ఆర్టీసికి చెల్లించిందన్నారు. మహిళల విజయాలను జీర్ణించుకోలేక ఉచిత ప్రయాణాన్ని బీఆఎస్ నేతలు అవహేళన చేస్తున్నారని మండిపడ్డారు. ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు మహిళల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. తమది మహిళా పక్షపాత ప్రభుత్వమని... అందుకే ఉచిత ప్రయాణంతో పాటు వడ్డి లేని రుణాలు, రూ.500 కే వంట గ్యాస్, 200 యునిట్ల వరకు ఉచిత విద్యుత్ కల్పిస్తున్నట్లు చెప్పారు. ములుగులో ఆదునాతన బస్టాండ్ ను నిర్మణాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మేడారం, చుట్టుపక్కల ప్రాంతాలకు భక్తులు, పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నందున.. బస్సు సర్వీసులను పెంచాలని అధికారులకు సూచించారు. అయితే మంత్రి సీతక్క తన హొదాను పక్కన పెట్టి ఆర్టీసీ బస్సులో సాధారణ ప్రయాణికురాలిగా ప్రయాణించి.. మహిళలు, ఆర్టీసీ బస్సు, కండక్టర్ తో మాట్లాడి ఉచిత ప్రయాణంపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. మంత్రి తమతో పాటు ప్రయాణించి, అప్యాయంగా పలకించడంతో మహిళా ప్రయాణికుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.



# ఏబీవీపీ కేయూ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా హరికృష్ణ జ్ఞానేశ్వర్‌లు ఎన్నిక




**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

అఖిల భారతీయ విద్యార్థీ పరిషత్ కాకతీయ విశ్వవిద్యాలంలో నూతన కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు హాజరై చేవెళ్ల మండలం ఊరెళ్ళా గ్రామానికి చెందిన హరికృష్ణను యూనివర్సిటీ అధ్యక్షుడుగా ప్రకటించడం జరిగింది. ఇది వరకే రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా హరికృష్ణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా పై నమ్మకం ఉంచి యూనివర్సిటీ అధ్యక్షులుగా బాధ్యతను ఇచ్చినందుకు, యూనివర్సిటీ శాఖకు రాష్ట్ర శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా విద్యార్థి పరిషత్ ఏ బాధ్యత ఇచ్చినా శక్తి వంచన లేకుండా పనిచేస్తానని, రాబోవు రోజుల్లో విద్యార్థులు ఏ సమస్య వచ్చిన వారి పక్షాన పోరాటం చేయటానికి తానూ సిద్ధంగా ఉన్నాను అనీ, యూనివర్సిటీ విద్యార్థులకి ఏ చిన్న సమస్య వచ్చిన ఊరుకునేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ విభాగ్ సంఘటన మంత్రి పృథ్వీరాజ్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి అంబాల కిరణ్, యూనివర్సిటీ ఇంచార్జ్ నిమ్మల రాజేష్, ఆగపాటి రాజు, పూర్వ అధ్యక్షులు మెరుగు సాయికుమార్, సెక్రటరీ శివ, తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్**

**ములుగు. జై భీమ్ న్యూస్**



ములుగు జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శబరీష్ సూచించారు వాతావరణ శాఖ వారం రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేసినందున గోదావరి పరివాహక ప్రాంతాలు లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా వరద ప్రవాహం ఉన్న వంతెనలు కల్వర్టులు రహదారులపై నుంచి దాటకూడదని శిథిలా వ్యవస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండకూడదని తడి కరెంటు పోల్స్ ట్రాన్స్ఫార్లను తాకకూడదని గ్రామాల్లో చేపల వేటకు ఎవరు వెళ్లకూడదని అత్యవసరమైతే తప్ప ఎవరు బయటకు రావద్దని సూచించారు అలాగే బందోబస్తులో ఉన్న పోలీస్ సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించి పోలీసులకు సహకరించాలని సూచించారు అత్యవసర సమయంలో ప్రజలకు పోలీసుల సహాయం పొందేందుకు 100 నెంబర్ ను వినియోగించుకోవాలన్నారు.

# భద్రకాళి ఆలయంలో హుండీ లెక్కింపు

**ఎనభై ఎనిమిది లక్షల నలభై ఒక్క వేయి ఐదు వందల పది రూపాయలు ఆదాయం**




**వరంగల్ జై భీమ్ న్యూస్**

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానం హుండీలు విప్పి లెక్కింపు జరుపగా రూ. 88,41,510=00 (అక్షరాల ఎనభై ఎనిమిది లక్షల నలభై ఒక్క వేయి ఐదు వందల పది రూపాయలు మాత్రమే) ఆదాయం సమకూరినది. అట్టి ఆదాయము యూనియన్ బ్యాంక్, కె.ఎం.సి బ్రాంచినందు జమచేయనైనది. విదేశీ కరెన్సీ 581 యూ.ఎస్.ఏ డాలర్లు, 20 యు.ఏ.ఈ దిరమ్స్, 25 కెనడా డాలర్లు, 11 ఖతర్ సెంట్రల్ బ్యాంకు రియాల్స్, 20 యూరోలు, 13 మలేషియా రింగేట్స్, 10 ఆస్ట్రేలియా డాలర్లు, 10 నేపాల్ రూపాయలు లభించారు. హుండీలో వెళ్ళినటువంటి మిశ్రమ బంగారం, వెండి తిరిగి హుండీలో వేయనైనది. ఈ హుండీ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా దేవాదాయ శాఖ పరిశీలకులు డి. అనిల్కుమార్, దేవాలయ చైర్మన్ డా. బి. శివసుబ్రహ్మణ్యమ్, ధర్మకర్తలు టి. వీరన్న, ఎన్. సుగుణ, ఎం. మయూరి, జి. స్రవంతి, ఓ. పూర్ణచందర్, బి. సతీష్, జె. వెంకటేశ్వర్లు, అనంతల శ్రీనివాసరావు, ఈ.ఓ, ఏ.సి శేషుభారతి, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు, లక్ష్మి శ్రీనివాస సేవా ట్రస్ట్ అధ్యక్షులు జి. కృష్ణారెడ్డి, లక్ష్మి వెంకటేశ్వర సేవా సమితి అధ్యక్షులు జి. నవీన్ ఆధ్వర్యంలో సభ్యులు 180 మంది, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మడిపల్లి ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసిన ఎంఈఓ

**పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ ను అభినందించిన ఎంఈఓ శ్రీనివాస్**




**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

హాసన్ పర్తి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ మడిపల్లి ప్రాథమిక పాఠశాలకు ప్రార్థన సమయానికి హాజరై పాఠశాలలో జరుగుతున్న ఎఐ బోధన, ఎస్ఎల్ఎన్ రికార్డులను పరిశీలించారు. పిల్లల డైరీలను, అనిత అందించిన టై, బెల్టులను విద్యార్థులందరికీ పంపిణీ చేశారు. పిల్లల పాఠ్యపుస్తక పఠనాన్ని పరిశీలించారు. పిల్లల నమోదును ఈ సంవత్సరం గణనీయంగా పెంచినందుకు ఉపాధ్యాయులను అభినందించారు. పిల్లలలో లెర్నింగ్ అవుట్ కమ్స్ కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు . ఆంగ్ల బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు గీటుగా సమయ పాలనకు అతీతంగా విధి నిర్వహణ చేయాలన్నారు. చక్కగా పాఠశాల నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు బిటవరం శ్రీధర్ స్వామి, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# నటుడు రానాకు ఇడి మరోమారు నోటీసులు

హైదరాబాద్,జూలై23(జై భీమ్ న్యూస్): ఇడి రానాకు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆగస్టు 11వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. కాగా, రానాతో పాటు నటులు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మిలకు కూడా ఇడి నోటీసులు ఇచ్చింది. ప్రకాశ్ రాజ్ జూలై 30న, విజయ్ ఆగస్టు 6న, లక్ష్మి ఆగస్టు 13న విచారణకు రావాలని స్పష్టం చేసింది. బెట్టింగ్ యాప్‌ల కేసులో విచారణకు హాజరయ్యేందుకు గడువు కావాలంటూ సినీ నటుడు రానా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను కోరిన సంగతి తెలిసిందే. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు నిర్వాహకులు ఇచ్చిన పారితోషికానికి సంబంధించి మనీలాండరింగ్ జరిగిందనే అనుమానంతో ఈడీ దర్యాప్తు చేస్తోంది. బుధవారం రానా ఈడీ ఎదుట హాజరుకావాల్సి ఉంది. ముందస్తు కార్యక్రమాలు, షూటింగ్‌ల వల్ల బుధవారం విచారణకు హాజరు కాలేనని, తనకు కొంత గడువు కావాలని రానా.. ఈడీని కోరారు. ఆయన చేసిన అభ్యర్థనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు స్పందించారు. ఆగస్టు 11న కచ్చితంగా విచారణకు రావాలంటూ తెలిపారు. మరోవైపు సినీ నటు-లు ప్రకాశ్‌రాజ్ ఈ నెల 30న, విజయ్‌దేవరకొండ ఆగస్టు 6న, మంచులక్ష్మి ఆగస్టు 13 తేదీల్లో విచారణ నిమిత్తం తమ ఎదుట హాజరుకావాలంటూ ఈడీ అధికారులు ఇప్పటికే తమ నోటీసుల్లో పేర్కొన్నారు. ఇంకా పలువురు సెలెబ్రిటీలు, యూట్యూబర్లకు నోటీ-సులు జారీ చేసి విచారించనున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

## స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుపై స్పోర్ట్స్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జెయేష్ రంజన్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

హైదరాబాద్ టూరిజం ప్లాజా లోని తెలంగాణ స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జెయేష్ రంజన్ ని వారి కార్యాలయంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో ఎమ్మెల్యలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్. నాగరాజు కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ పాఠశాల మరియు అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటు పై ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు చర్చించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు అవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఉనికిచర్ల వద్ద జాతీయ రహదారి 163కి అనుకోని ఉన్న 20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో స్పోర్ట్స్ పాఠశాల ఏర్పాటుకు స్పష్టమైన హామీ ఇచ్చారని అన్నారు. ముఖ్యమంత్రి మద్దతుతో ఆగస్టు 15న స్పోర్ట్స్ పాఠశాలను ప్రారంభించేందుకు తాత్కాలిక భవనాన్ని, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. కావున స్పోర్ట్స్ పాఠశాలను ప్రారంభించేందుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జెయేష్ రంజన్ స్పోర్ట్స్ పాఠశాలను ఆగస్టు 15న ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## జాతీయ ప్రధాన రహదారిపై చెట్లను తొలగించిన పోలీసులు





ఏటూరు నాగారం, జై భీమ్ న్యూస్

ఏటూరు నాగారం గత రెండు రోజులు వర్షాలకు కమలాపురం ఏటూరు నగరం రోడ్డు మార్గమధ్యలో జీడివాగు సమీపంలో భారీ వృక్షాలు విరిగిపడడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది ములుగు జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశాల మేరకు అప్రమత్తమైన ఏటూరు నాగారం ఎస్సై రాజ్ కుమార్ తమ సిబ్బందితో కలిసి భారీ వృక్షాలను తొలగించి రాకపోకలను ఎలాంటి ఇబ్బందు లేకుండా చర్యలు తీసుకోవడం జరిగింది.

## ట్రాక్టర్ దమ్ము చక్రాలతో రోడ్లపై నడిపితే చర్యలు తప్పవు పస్రా ఎస్ఐ కమలాకర్

పస్రా, జై భీమ్ న్యూస్



పస్రా మండలం ట్రాక్టర్ యజమానులకు పస్రా ఎస్సై కమలాకర్ పలు సూచనలు చేయడం జరిగింది వరి నాట్ల సీజన్ నేపథ్యంలో ట్రాక్టర్ యజమానులు తారు రోడ్లు మరియు సీసీ రోడ్లపై ట్రాక్టర్‌కు ప్రత్యేకంగా అమర్చే దమ్ము చక్రాలతో వాహనాలు నడిపితే, ట్రాక్టర్ యజమానుల పై కేసులు నమోదు చేస్తామని పస్రా ఎస్ఐ అచ్చా కమలాకర్ తేలిపారు. దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపై నడిపితే ప్రభుత్వ రహదారులపై తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. ప్రజాధనం అయిన రోడ్లను హానిచేసేలా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. ట్రాక్టర్ యజమానులు తారు మరియు సీసీ రోడ్లపై దమ్ము చక్రాలు అమర్చిన ట్రాక్టర్లను నడపరాదని, ఎవరైనా ఈ నిబంధనలను అతిక్రమిస్తే, ట్రాక్టర్ యజమానుల పై కేసులు నమోదు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రతి ట్రాక్టర్ యజమాని చట్టబద్ధంగా వ్యవహరించి, పోలీసులకు సహకరించాలని సూచించారు లేని యడల ట్రాక్టర్ యజమానుల పై కేసులు నమోదు చేస్తానని ఈసందర్భంగా తెలిపినారు.

# డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరి నుంచి కీలక సమాచారం సేకరణ

**సీపీ సీవీ ఆనంద్**

**హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న తొమ్మిది మంది అరెస్టు**

**అరెస్టైన ఇద్దరు కీలక వ్యక్తులకు ముంబై డ్రగ్స్ వ్యాపారులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తింపు**

**నిందితుల నుంచి రూ. 69 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడి**

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న తొమ్మిది మందిని అరెస్టు చేశామని, అందులో రవివర్మ, సచిన్ అనే ఇద్దరు కీలక వ్యక్తుల నుంచి ముఖ్యమైన సమాచారం సేకరించామని నగర సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. నగరంలో డ్రగ్స్ విక్రయిస్తుండటంతో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ పోలీసులు వారిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి 286 గ్రాముల కొకైన్, 11 గ్రాముల ఎక్స్‌టసీ, ఒక తుపాకీ, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీవీ ఆనంద్ కేసు వివరాలను వెల్లడించారు. డ్రగ్స్ కేసులో అరెస్టైన వారిలో ఇద్దరు కీలక వ్యక్తుల నుంచి ముఖ్యమైన సమాచారం సేకరించామని తెలిపారు. వారిలో రవివర్మకు ముంబైకి చెందిన ముఠాతో సంబంధాలు ఉన్నాయని, అక్కడ వాహిద్ అనే వ్యక్తికి విదేశాల నుంచి కొకైన్ వస్తుందని తెలిపారు. అతడి నుంచి నిందితులు హైదరాబాద్‌కు కొకైన్ తీసుకు వస్తున్నారని వెల్లడించారు. ప్రేమ్ ఉపాధ్యాయ్ అనే వినియోగదారుడిని అరెస్టు చేయడంతో ఈ ముఠా గుట్టు రట్టయిందని తెలిపారు. నిందితుల నుంచి రూ.69 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కాటేదాన్‌లో డ్రగ్స్ దందా చేస్తోన్న పవన్ భాటీని కూడా అరెస్టు చేసినట్లు సీవీ ఆనంద్ తెలిపారు. హేమసింగ్ అనే వ్యక్తితో కలిసి పవన్ డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.



## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపీస్**

**లోతట్టు ప్రాంతాలను, నది వరదను చూడడానికి వెళ్లకూడదు.**

**అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుండి బయటికి రాకూడదు**

**అత్యవసర సమయంలో డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712658129 నంబర్ ను సంప్రదించండి.**

భూపాలపల్లి, జై భీమ్ న్యూస్



జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపీస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న మరో 3 రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రజలెవ్వరూ లోతట్టు ప్రాంతాలను, చెరువులు, కుంటలను గోదావరి, మానేరు నదులను చూడడానికి వెళ్లకూడదని, వెళితే ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 87126 58129 ను సంప్రదించవలసిందిగా సూచించారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలు వరద ప్రభావం ఉన్న ప్రజలను అప్రమత్తం చేయాలని ఎస్పీ తెలిపారు.

## మల్లన్న చేపట్టిన బిసి ఉద్యమానికి మద్దతు తెలిపిన రాష్ట్ర బిసి యువనాయకులు వరిపల్లి అనిల్ కుమార్



హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మీద మరియు క్యూ న్యూస్ ఆఫీస్ పై జరిగిన దాడిని ఖండిస్తూ మహబూబాద్ జిల్లా నెల్లికుదూర్ కి చెందిన రాష్ట్ర బిసి యువనాయకులు వరిపల్లి అనిల్ కుమార్, కొమ్మినేని శరత్ పటేల్ ల అధ్వర్యంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నని కలిసి సంఘీబావం తెలిపారు. అనంతరం మల్లన్న చేపడుతున్న బిసి ఉద్యమాన్నికి సంపూర్ణ మద్దతు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి పొలిటికల్ జెఎసి కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్, బిసి పొలిటికల్ జెఎసి సమన్వయకర్త బందారపు నర్సయ్య, మహబూబాద్ జిల్లా నెల్లికుదుర్ మండలని కి చెందిన బిసి యువజన నాయకులు దేగల నవీన్ కుమార్, శీలం నగేష్, దేగల రమేష్, పల్లోజు కార్తీక్ చారీ, నెలుట్ల అజయ్, కోటగిరి అరుణ్ కుమార్, కోటగిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పశువుల రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

ములుగు, జై భీమ్ న్యూస్

ములుగు పోలీస్ ఉన్నత అధికారుల ఉత్తర్వుల మేరకు ఈరోజు ఉదయం 5 గంటల సమయంలో ములుగు బస్ స్టాండ్ వద్ద ములుగు ఎస్సై వెంకటేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేయుచుండగా TS12UC 4656 నెంబర్ గల ఐచర్ డీసీఎం గూడ్స్ వెహికల్‌లో 11 ఎద్దులు బంధించి తీసుకెళు ండగా పట్టుకొని అట్టి పశువులను గోశాలకు తరలించి పశువులను నిర్బంధంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయడం జరిగింది.



## భూభారతి దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హసన్ పర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్**





హన్మకొండ జిల్లా (హసన్ పర్తి) జై భీమ్ న్యూస్

భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ఆయా విభాగాలను సందర్శించి అధికారులు సిబ్బందిని గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూభారతి మాడ్యూల్ ఫైళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా రోజువారీగా సాగుతున్న భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తహసిల్దార్ చల్లా ప్రసాద్, ఇతర అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి దరఖాస్తులలో సంబంధిత రైతులకు నోటీసులు అందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నాయబ్ తహసిల్దార్ రహీం పాషా, ఆర్ఐలు కుమార్, ఫాజిల్, ప్రసాద్, సర్వేయర్ సుజాత, జూనియర్ అసిస్టెంట్ లు నరసింహులు, దేవిక, సతీష్, నరేష్, శ్వేత, రికార్డ్ అసిస్టెంట్లు చుంచు శ్రీనివాస్, డి. కిరణ్, విఆర్ఎలు ఎఎస్ఓ రోజారాణి, మోకానపెల్లి అనిల్, బి. హిమేష్, సస్య, అనూష, పున్నం, సమ్మయ్య, రమేష్, చైన్ మెన్ గణేష్, తిరుపతి, రవళిక ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో విస్తృతంగా వాహన తనిఖీలు

ములుగు, జై భీమ్ న్యూస్

మావోయిస్టుల వారోత్సవాలు జూలై 25 నుండి ఆగస్టు మూడు వరకు జరగనున్న నేపథ్యంలో ములుగు సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలో భాగంగా ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో కాసిం దేవి పేట వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నల్ల గుంట పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో బుస్సాపూర్ క్రాస్ మరియు తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో కల్వపల్లి చెక్పోస్ట్ వద్ద వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానితులను విచారించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు ఎవరు కూడా నిషేధిత సిపిఐ మావోయిస్టులకు సహకరించవద్దు అని ఎవరైనా సహకరిస్తే చర్యలు తీసుకుంటామని ములుగు డి.ఎస్.పి రవీందర్ తెలియజేయడం జరిగింది.



# మహాలక్ష్మి పథకం తోటి లాభాల్లోకి టీజీఎస్ఆర్టిసి





**ఆర్టీసీకి ఊపిరి మహాలక్ష్మి పథకం**
**హనుమకొండ ఆర్డిఓ రమేష్ రాథోడ్**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

మహాలక్ష్మి పథకం తోటి ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందని హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) రమేష్ రాథోడ్ అన్నారు. మహాలక్ష్మి పథకం డిసెంబర్ 9, 2023 నుండి అమలై నేటి వరకు 200 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన సందర్భంగా స్థానిక హనుమకొండ బస్టాండ్ లో బుధవారం ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ కేశరాజు భానుకిరణ్ ఏర్పాటు చేసిన మహిళా అభినందన సభలో హనుమకొండ ఆర్డిఓ రమేష్ రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై ఉపన్యసించారు. ఈ సందర్భంగా రమేష్ రాథోడ్ మాట్లాడుతూ 200 కోట్ల మహిళా ప్రయాణికులను వారి గమ్యస్థానానికి చేరవేర్చి రూపాయలు 6680 కోట్ల ప్రయాణం చార్జీలను ఆదా చేసినందుకు రాష్ట్ర మహిళలందరికీ హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఒకప్పుడు ఆర్టీసీ నష్టాలు ఉండేదని కానీ నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో నష్టాలు పోయి లాభాల బాటలో కి వచ్చిందని అన్నారు. ప్రతి ఒక్క బస్సులో 70 శాతం మహిళా ప్రయాణికులు ఉంటే కేవలం 30 శాతం మాత్రమే పురుష ప్రయాణికులు ప్రయాణిస్తున్నారని అన్నారు. మహిళలకు ఎన్నో పనులు ఉంటాయని ముఖ్యంగా చిన్న చిన్న వ్యాపారం చేసుకునే వాళ్ళు, కాలేజీలకు వాళ్ల మార్కెట్కు వచ్చేవాళ్ళు హాస్పిటల్లో పనిచేసేవాళ్లు, షాపుల్లో పనిచేసే వాళ్ల ఇంకా అనేక రంగాల్లో పనిచేసే వాళ్లు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని అన్నారు. ఈ పథకం వల్ల మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారని ప్రయాణ ఖర్చులు పూర్తిగా ఉచితం అవడంతో వారి జీవనశైలిలో మార్పు వచ్చిందని అన్నారు. ఆర్టిసి కూడా అనేక డిపో లు నష్టాలు చవి చూశాయని ఈ పథకం వల్ల ఆర్టీసీ లాభాల బాట పట్టిందని అన్నారు. అంతేకాక ఈ పథకం వల్ల ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ పూర్తిగా తగ్గిపోయిందని అన్నారు. ఈ పథకాన్ని రాష్ట్రంలోని మహిళలందరూ ఉపయోగించుకొని ఉన్నత స్థితికి రావాలని కోరుకుంటున్నాను. అని అన్నారు. కార్యక్రమం ఉద్దేశించి డిప్యూటీ రీజినల్ మేనేజర్ కేశరాజు భాను కిరణ్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా పెరిగిన ప్రయాణికుల రద్దీ దృశ్య 112 ఎలక్ట్రికల్ బస్సులను వరంగల్ టూ డిపోలో ప్రవేశపెట్టామని 40 కొత్త డీజిల్ బస్సులను కూడా ప్రవేశపెట్టాలని అన్నారు ఏ టువంటి కంప్లైంట్స్ లేకుండా మహిళల రద్దీకణుగుణంగా ఈ బస్సులను ప్రవేశపెట్టామని అన్నారు దేశంలోనే కర్ణాటక రాష్ట్రం తర్వాత మన రాష్ట్రంలో ఈ పథకం ప్రవేశపెట్టిందని అలాగే మన రాష్ట్రంలో నూటికి నూరు శాతం ఈ పథకం అమలవుతుందని అన్నారు డ్రైవర్ కండక్టర్లు బస్సులో ఎంతమంది ఎక్కిన ఇసుక్కోకుండా శ్రమ అనుకోకుండా పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తూ ప్రయాణికులందరిని క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుస్తున్న చేస్తున్నారని అన్నారు వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు అని అన్నారు అలాగే ఈ పథకానికి సహకరిస్తున్న మహిళ లందరికీ టీజీఎస్ఆర్టిసి తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ఈ మహాలక్ష్మి పథకం వరంగల్ రీజియన్ లో 15 కోట్ల 43 లక్షల మంది మహిళా ప్రయాణికులు ఈ పథకాన్ని ఉపయోగించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా కొంతమంది మహిళలకు కాంపిటీషన్ పెట్టామని వారికి ఆర్టీసీ తరఫున అవార్డ్స్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఉపన్యాస పోటీలు, ఎస్సే రైటింగ్ పోటీలు పెట్టడం జరిగింది అని అన్నారు. ఈ పోటీలో గెలుపొందిన వారందరికీ ఆర్డిఓ రమేష్ రాథోడ్ చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ పోటీల్లో ఎస్సే రైటింగ్ లో ఆదిత్య 9వ తరగతి, ఎస్. జైవీర్ 8వ తరగతి, కే సారిక డిగ్రీ థర్డ్ ఇయర్. బి సరిత బీఎస్సీ సెకండ్ ఇయర్, బి సరస్వతి బీకాం లు బహుమతులు గెలుచుకున్నారు అలాగే రెగ్యులర్ ప్రయాణికులకు సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ 1 డిపో మేనేజర్ పి. అర్పిత, అసిస్టెంట్ మేనేజర్ సి.హెచ్. సంతోష్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ (ఎం) అమల, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కీర్తి, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన ఎస్ఐ సంతోష్



**సిరోలు. జై భీమ్ న్యూస్**

మహబూబాబాద్ జిల్లా సిరోలు మండలం ఏకలవ్య పాఠశాలలో ఎస్సై సంతోష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంతోష్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ర్యాగింగ్ ఇవిటీజింగ్ సైబర్ నేరాలు మానవ అక్రమ రవాణా మైనర్ డ్రైవింగ్ మత్తు పదార్థాలు డ్రగ్స్ పై అవగాహన కల్పించారు అపరిచిత వ్యక్తుల నుండి ఫోన్ కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దని విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని చదువుపై దృష్టి సారించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉంచడం జరిగింది.

## చేపల వేటకు వెళ్లి వాగులో ఒకరు గల్లంతు

**కొత్తగూడ, జై భీమ్ న్యూస్**





చేపల వేటకు వెళ్లి వాగులు ఒకరు గల్లంతయిన ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో చోటుచేసుకుంది గత రెండు రోజుల్లో నుంచి కురుస్తున్న వర్షానికి ఉదృతంగా ప్రవహిస్తున్న రాళ్ల తిట్టే వాగులు చేపల వేటకు వెళ్లిన కొత్తగూడ బూరుగుంపు గ్రామానికి చెందిన ఆగబోయిన నరేష్ (30) వరద ఉధృతికి గల్లంతయినట్లు గ్రామస్తులు తెలిపారు కాగా సంఘటన స్థలానికి డిఎస్పి తిరుపతిరావు సిఐ సూర్యప్రకాష్ ఎస్సై రవికుమార్ గాలింపు చర్యలు ముమ్మరం చేశారు చేపల వేటకు వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని డీఎస్పీ తిరుపతిరావు కోరారు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలని వరదల వల్ల ఇబ్బందులు ఉంటే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు.

## భారీగా గంజాయి పట్టివేత




**వరంగల్, జై భీమ్ న్యూస్**

వరంగల్ ఇంతేజర్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు పెట్రోలింగ్ చేయుచుండగా రైల్వే స్టేషన్ సమీపంలో రవి టిఫిన్ సెంటర్ ముందు ఒక మగ మనిషి ఒక ఆడ మనిషి అనుమానస్పదంగా నాలుగు బ్యాగులు పట్టుకొని కనిపించగా పోలీసులు వెళ్లి తనిఖీ చేసే ప్రయత్నం చేయగా ఇద్దరు వ్యక్తులు భయంతో పారిపోతుండగా పట్టుకొని విచారించగా సుమారు 18 కిలోల ఎండు గంజాయి లభించగా ఇద్దరు పంచుల సమక్షంలో సేకరించి పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో విచారించగా అట్టి వ్యక్తులు ఒడిస్సాకు సంబంధించిన వారై కూలి పని చేసుకుంటూ వచ్చిన డబ్బులు గిట్టుబాటు కానందున గంజాయి వ్యాపారం చేసి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఆలోచనతో ఒడిస్సా గ్రామం లో గుర్తుతెలియని వ్యక్తి వద్ద సుమారు 18 కిలోల ఎండు గంజాయి తీసుకుని సోలాపూర్ లో 50 వేల రూపాయల కిలో చొప్పున అమ్ముకొనుటకు వెళుతుండగా సోలాపూర్ వెళ్ళుటకు ట్రైన్ లో టికెట్ లేకుండా జనరల్ భోగిలో ప్రయాణిస్తుండగా వరంగల్ రైల్వేస్టేషన్లో టి సి తనిఖీ చేస్తుండగా భయపడి ట్రైన్ దిగి రైల్వే స్టేషన్ ఎదురుగా టిఫిన్ సెంటర్ వద్ద ఉండగా వారిని పట్టుకుని వరంగల్ కోర్టులో హాజరు పరచడం జరిగింది. ఇట్టి విషయంలో ప్రతిభ కనబరిచిన ఇంతేజర్ గాంజ్ సీఐ షుక్రు ఎస్సై వెంకటేశ్వర్లు బిక్షపతిని ఏఎస్పి శుభం అభినందించడం జరిగింది.

## షెడ్యూల్ ప్రకారమే మిరాయ్ విడుదల

హనుమాన్ సినిమాతో పాన్ ఇండియా ఇమేజ్ సొంతం చేసుకున్నాడు యువ నటుడు తేజసజ్జా ఈ టాలెంటెడ్ యాక్టర్ హీరోగా నటిస్తున్న మరో పాన్ ఇండియా అడ్వెంచరస్ మూవీ మిరాయి. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో ఢిల్లీ భామ రితికా నాయక్ ఫీమేల్ లీడ్ రోల్లో నటిస్తోంది. మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. సినిమా కోసం ఎదురుచూస్తున్న వారి కోసం మ్యూజికల్ అప్డేట్ అందించారు. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ వైబ్ ఉంది అప్డేట్ అందించారు. వైబ్ ఉంది అంటూ సాగే మెలోడీ ట్రాక్ను జులై 26న తెలుగుతోపాటు- పలు ప్రధాన భాషల్లో విడుదల చేయనున్నట్టు- ప్రకటించారు. సాంగ్ అనౌన్స్మెంట్ పోస్టర్లో తేజ సజ్జా, రితికా నాయక్ రొమాంటిక్ ఫోజులో ఉండటం చూడొచ్చు. మిరాయి అనుకున్న షెడ్యూల్ ప్రకారమే 2025 సెప్టెంబర్ 5న పలు భాషల్లో విడుదల కానున్నట్టు- ప్రకటించి సినిమా వాయిదా పుకార్లకు చెక్ పెట్టారు మేకర్స్.

## పాఠశాలను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

**ఐనవోలు, (జై భీమ్ న్యూస్)**

ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో ఉన్న పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఇంగ్లీష్ మీడియం) ను కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో ఒంటిమామిడిపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులందరు కలిసి పాఠశాల ను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ మాట్లాడుతూ, పాఠశాల లో ప్రీ-ప్రైమరీ పిల్లల విషయం లో కమిటీ వారి పని తీరు బాగాలేదని,నర్సరీ,ఎల్కేజీ,యూకేజీ ఈ మూడు తరగతులకు కలిపి ఒకే ప్రైవేట్ ఉపాధ్యాయురాలుతో విద్యా బోధన చేపిస్తున్నారని, చిన్న తరగతి గదిలో 100 మందికి పైగా విద్యార్థులను కూర్చోబెట్టి పిల్లలకు ఊపిరి ఆడకుండా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. మరుగుదొడ్ల విషయం లో ఏ మాత్రం పరిశుభ్రత లేదని, ఇలాంటి మరుగుదొడ్లు వాడితే పిల్లలు అనారోగ్యాలకు గురి అవుతారని అన్నారు. ముఖ్యంగా పాఠశాల లో ఉండే రెండు అంగన్ వాడీ కేంద్రాలు ఉండగా,రెండు కేంద్రాలకు కలిపి ఒకే చిన్న రేకుల షెడ్ ఇవ్వడం సరికాదు అని అన్నారు. పాఠశాల లో ఇంకా రెండు పక్కా భవనాలు ఖాళీగా ఉన్నా కూడా వీరికి ఒకే రేకుల షెడ్ ఇవ్వటమేమిటని ప్రశ్నించారు. పాఠశాల ప్రారంభం అయి సుమారు రెండు నెలలు పూర్తి కావస్తున్నా, తల్లిదండ్రుల వద్ద సుమారు యాభై లక్షలు రూపాయలు వసూలు చేసి ఇంతవరకూ ప్రైవేట్ టీచర్స్ నియామకం జరగపోవడం శోచనీయమని అన్నారు.కంప్యూటర్ తరగతులు బోధించడానికి ప్రత్యేకంగా ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు.గత ఎస్ఎంసీ చైర్మన్ చేసిన ఆర్థిక దోపిడీని, వనరుల దోపిడీని వెలికి తీసి అట్టి డబ్బులను రికవరీ చేయించాలని, అలాగే ఇప్పుడు ఉన్న తాత్కాలిక పేరెంట్స్ కమిటీ ఎన్నిక న్యాయం బద్ధంగా జరగలేదని, అట్టి కమిటీని తక్షణమే రద్దు పరిచి, తల్లిదండ్రులందరికీ సమాచారమిచ్చి అందరి సమక్షంలో కొత్త కమిటీ ఎంపిక చేయాలని, అట్టి కమిటీ లో కేవలం స్థానిక గ్రామం వారు మాత్రమే ఉండాలని, వేరే గ్రామస్థులకు కమిటీ లో చోటు ఇవ్వడం సరి కాదని, ప్రధానోపాధ్యాయులు మంద సదానందంకి వినతిపత్రం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిరుక రాజు,మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెండ్లి నవీన్,గ్రామ సీనియర్ నాయకులు పెండ్లి సంపత్,కొనుకటి శంకర్ రెడ్డి,అద్దెంకి రమేష్, మజ్జిగ రాములు, యూత్ నాయకులు మజ్జిగ శ్రీకాంత్,కడుదూరి హరీష్, మామిండ్ల రంజిత్, రాజారపు గణేష్, గ్రామ నాయకులు ఎరుకల బుచ్చిరెడ్డి,గోనె భాస్కర్, గోనె ప్రణయ్, ఉడుత శ్రీకాంత్,పెండ్లి కరుణాకర్,అనుముల శ్రీను, అనుముల మహిపాల్,మహమ్మద్ ఇబ్రహీం, కొట్టం రమేష్, కొట్టం శ్యామ్, రాజబాబు, రాజారపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.




## స్వాతంత్ర్య పోరాటంలో కొత్త పుంతలు

**ప్రజలను సమీకరించడంలో తిలక్ విజయం**

**ముంబై,జూలై23(జై భీమ్ న్యూస్):**

స్వాతంత్ర పోరాటాన్ని కొత్త పుంతలు తొక్కించిన స్ఫూర్తి ప్రదాత లోకమాన్య బాగంగాధర్ తిలక్.. ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకుని రావడంలో ఆయన కృతకృత్యులయ్యారు.1856, జులై 23 మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన వినాయక ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించి స్వాతంత్ర్యోద్యమ కాంక్షను రగిలించారు. ప్రజలను వినాయక ఉత్సవాల పేరుతో సమీకరించారు. వారిలో విప్లవ చైతన్యాన్ని రగిలించారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితోనే ఇవాళ వినాయక చవితి ఉత్సవాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. ప్రజల్లో ఐక్యతకు ఇవి ఎంతగానో దోమదపడ్డాయి. గాంధీజీ దృష్టిలో ఆయన 'ఆధునిక భారత నిర్మాత! నెహ్రూకాయన – 'భారత విప్లవ పిత!' అహింసతో మహాత్ముడు బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడిస్తే... 'ఆలోచన'తో భారతీయులను తట్టిలేపి, తెల్లవారి గుండెల్లో కల్లోలం సృష్టించి... భారతావని నుదిటిన స్వరాజ్య 'హక్కు' తిలకం దిద్దిన బుద్ధిజీవి... బాల గంగాధర్ తిలక్! మనం ఈరోజు వింటున్న ఆత్మనిర్భర్, మేకిన్ ఇండియాను వందేళ్ల కిందటే ఆకాంక్షించిన ఆ దార్శనికుడిగా తిలక్ పేరు గడించారు. ఆయనో తత్వవేత్త, గణితవేత్త, జర్నలిస్టు, రచయిత.. ఉద్యమ కారుడు. తిలక్ దృష్టిలో స్వరాజ్యమంటే కేవలం రాజకీయ స్వాతంత్ర్యం ఒక్కటే కాదు. సాంస్కృతిక, ఆర్థిక స్వాతంత్ర్యం కూడా! సంస్కృతి, విద్య, మీడియా... మూడింటినీ మార్గాలుగా చేసుకొని ప్రజల్ని చైతన్య వంతులను చేయటానికి, భారత జాతీయ అస్థిత్వాన్ని పాదుకొల్ప టానికి కృషి చేశారు తిలక్. ఆత్మనిర్భర్ భారత్... నైపుణ్య భారత్, మేకిన్ ఇండియా...అంటూ ఇప్పుడు మనం ప్రతిరోజూ వినే ఈ పదాల్ని వందేళ్ళ కిందటే మంత్రించారు తిలక్! తన స్వదేశీ అర్థం కేవలం విదేశీ వస్తువులను బాయ్కాట్ చేయటమే కాదు... దేశీయంగా మనవాళ్ళు పారిశ్రామికవేత్తలుగా మారాలని, భారత్లో తయారీ రంగం విస్తరించాలని కోరుకునే వారు. ఆయనిచ్చిన ఈ స్ఫూర్తితోనే ఈశ్వర్దాస్ వర్ష్ణే పుణె దగ్గర గ్లాస్వర్క్స్ ఫ్యాక్టరీ ఆరంభించారు. ముంబైలో జంషెడ్జీ టాటాతో కలసి తిలక్ బొంబాయి స్వదేశీ సహకార స్టోర్స్ కంపెనీ మొదలెట్టారు. భారత్లో తయారయ్యే వస్తువులను ప్రోత్సహించటం ఈ కంపెనీ ప్రధాన కర్తవ్యం.ట్యుటికోరిన్లో చిదంబరం పిళ్ళై షిప్పింగ్ కంపెనీ తెరిచారు. బ్రిటిష్ ఇండియా స్టీమ్ నావిగేషన్ కంపెనీకి అది తీవ్రమైన పోటీనిచ్చింది. చివరకు... మాండలే జైలులో ఉన్నప్పుడు రాసిన గీతారహస్య పుస్తకం అచ్చువేసేందుకు భారత్లో తయారైన కాగితాన్నే వాడాలని పట్టుబట్టారు.



జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem

# పవన్ స్వాగ్ అంటే ఇష్టం: నారా లోకేశ్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు జోరు చూస్తుంటే గత సినిమాల తాలూకు రికార్డులు బద్దలు కొట్టేలా ఉన్నాడు. మొదటి రోజు ఓపెనింగ్స్ ఊహించిన దానికి మించి ఉండేలా కనిపిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసిన హరిహర వీరమల్లు హంగామా కనిపిస్తోంది. పవర్ స్టార్‌ను ఎప్పుడెప్పుడు స్క్రీన్ మీదా చూస్తామా అని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. మరికొన్ని గంటల్లో హరిహరుడు వీరతాండవం చేయబోతున్నాడు. కాగా హరిహర వీరమల్లుకు అటు- సినీ ప్రముఖులు.. ఇటు- రాజకీయ ప్రముఖులు తమ అబినందనలు తెలుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఐటి మినిస్టర్ నారా లోకేష్ హరిహర వీరమల్లుకు విషెష్ తెలియజేస్తూ 'మా పవన్ అన్న సినిమా హరిహర వీరమల్లు విడుదల సందర్భంగా సినిమా నిర్మాణంలో పాలుపంచుకున్న చిత్ర బృందానికి అభినందనలు. పవర్ స్టార్ అభిమానుల్లాగే నేనూ ఈ సినిమాను చూసేందుకు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాను. పవనన్న, ఆయన సినిమాలు, ఆయన స్వాగ్ నాకు చాలా చాలా ఇష్టం. పవర్ స్టార్ పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో 'హరిహర వీరమల్లు' అద్భుత విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆయన వ్యక్తిగత ఖాతాలో టీ-÷-వట్ చేసారు. నారా లోకేష్ చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నారా లోకేష్ కు కృతజ్ఞలు తెలుపుతూ కామెంట్స్ చేస్తున్నారు. నేడు ప్రీమియర్స్ తో విడుదల కానున్న హరిహర వీరమల్లు సినిమాను పవర్ స్టార్ తో కలిసి నారా లోకేష్ స్పెషల్ చూడబోతున్నట్లు- సమాచారం.



# 20 ఏళ్లకెరీర్‌లో ఎంతో నేర్చుకున్నా: రెజీనా

సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీక్రి వచ్చి గుర్తింపు తెచ్చుకున్నారు నటి రెజీనా. ఆమె పరిశ్రమకు వచ్చి 20 ఏళ్లు అయిన సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి మాట్లాడారు. 20 ఏళ్ల కెరీర్‌ను మైలురాయిగా ఎందుకు చూస్తారో అర్థమైందన్నారు. కానీ, తాను కొన్ని విషయాల్లో అగ్రస్థానంలో లేనన్నారు. కొన్నేళ్లుగా వరుసగా తెరపై కనిపించనప్పటికీ 20 ఏళ్లంటే చాలా పెద్ద విషయమని చెప్పారు. గతంలో ఓమారు సంవత్సరంలో నాకు పని చేయాలనిపించలేదు. యాక్టింగ్ మానేయాలనుకున్నాను. అంగీకరించిన ప్రాజెక్ట్‌లు పూర్తి చేశాను. 2018 నుంచి అవకాశాలు వరుస పెట్టాయి. ఒకేతరహా పాత్రల్లో నటించకూడదని నిర్ణయించుకున్నాను. టాలీవుడ్‌లోకి వెళ్లిన తొలినాళ్లలో ఉదయం 6 గంటలకే నాకు డైలాగులు తెచ్చి ఇచ్చేవారు. అప్పుడు నాకు తెలుగు రాదు. దీంతో ఎంతో కష్టపడాల్సి వచ్చింది. అన్ని డైలాగులు కంఠస్థం చేశాను. భావోద్వేగాలను అర్థం చేసుకున్నాను. లైన్ టూ లైన్ నేర్చుకోవడం ప్రాక్టీస్ చేశా. ఇప్పుడు తెలుగు బాగా మాట్లాడగలను. నాకు సినీ నేపథ్యం లేదు. ఇండస్ట్రీకి రావాలనుకున్నప్పుడు నటించి, ఇంటికి వచ్చేయడమే అని భావించాను. కానీ, కాలం గడిచేకొద్దీ పీఆర్‌లు, సోషల్ మీడియా ప్రాధాన్యం గురించి అర్థమైంది. నేను వీటికి చాలా రోజులు దూరంగా ఉన్నాను. నా నటనను చూసి అవకాశం ఇవ్వాలి కానీ, పబ్లిసిటీ చూసి కాదని అనుకున్నాను. కానీ, ఇప్పుడు సోషల్ మీడియా ద్వారానే నా పనిని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్తున్నాను' అని చెప్పారు.

# రతన్ టాటా కూడా పెళ్లి చేసుకోలేదు: నిత్యామీనన్



బాష తో సంబంధం లేకుండా ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి నిత్యా మేనన్,. ఇప్పుడు 'సార్ మేడమ్' చిత్రంతో మళ్లీ అభిమానుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమా జూలై 25న విడుదల కాబోతున్న సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిత్య, ప్రేమ, సంబంధాల గురించి తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకున్నారు. నిత్య మాట్లాడుతూ.. 'ఒకప్పటి నా ఆలోచనలతో పోలిస్తే, ఇప్పుడు ప్రేమకు నా జీవితంలో అంత ప్రాధాన్యం లేదు. ప్రేమకు, సోల్‌మేట్‌కు మనం అవసరమని, లేకపోతే జీవితం అసంపూర్ణమని అనుకునే రోజులు నాకు కూడా వచ్చాయి. అలాంటి వ్యక్తిని వెతికిన అనుభవం కూడా ఉంది. కానీ.. కాలక్రమేణా అర్థమైంది.. మన జీవితం ఒక్క వ్యక్తి మీద ఆధారపడి ఉండాల్సిన అవసరం లేదని. ఒక్కరే ఉండటం ఒక లోపం కాదు. రతన్ టాటా కూడా పెళ్లి చేసుకోలేదు కదా! జీవితంలో పెళ్లి జరగకపోయినా మరేదేం ఉండదు. కొన్నిసార్లు తోడు లేదు అనే బాధ కలుగుతుంది, కానీ నేను ఈ స్వేచ్ఛను ఆస్వాదిస్తున్నాను. జీవితంలో అనుభవించిన పాఠాల వల్లే నేను ఈ స్థితిలో ఉన్నాను. ఏదైనా జరిగిన అది మన మంచికే అనుకోవడం నేర్చుకున్నాను' అని అన్నారు. నిత్య మాటలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# హాట్‌కేకుల్లా అమ్ముడైన హరిహర వీరమల్లు టిక్కెట్లు

**పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన పిరియాడికల్ యాక్షన్ చిత్రం హరిహర వీరమల్లు మరికొన్ని గంటల్లో థియేటర్స్ లో అడుగుపెడుతోంది. ఈ సినిమా అడ్వాన్స్ సేల్స్‌లో దూసుకెళ్తోంది..**

నైజాం ఏరియాలో నేటి నుండి అన్ని షోస్ కు అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేయగా హౌస్ ఫుల్స్ తో దూసుకెళ్తోంది. ఇక ఈ సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో రాత్రి 9.30 గంటలకు ప్రీమియర్స్ వేయబోతున్నారు. ఏపీలో ఇప్పటికి బుకింగ్స్ ఓపెన్ చేయగా సోల్డ్ అవుట్ అయ్యాయి. కానీ నైజాం లో పంపిణీదారులకు, ఎగ్జిబిటర్స్ కు మధ్య చిన్న తకరారు నడుస్తోంది. దాంతో ప్రీమియర్స్ బుకింగ్స్ ఓపెన్ చేయలేదు. అయితే ఇప్పుడు ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పడింది. హైదరాబాద్ లోని సింగిల్ స్క్రీన్స్‌కు సంబంధించి బుకింగ్స్ ఓపెన్ చేసారు. కానీ ఇలా ఓపెన్ చేయడం అలా నిమిషాలలోనే టికెట్స్ బుక్ అవడం జరిగాయి. ఒక రకంగా చెప్పాలంటే పవర్ స్టార్ సినిమా అందరి కంటే ముందే చూసేయాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టికెట్స్ హాట్ కేకుల్లా బుక్ అవుతున్నాయి. ఇప్పటివరకు కేవలం అడ్వాన్స్ బుకింగ్స్ లోనే వరల్డ్ వైడ్ గా రూ. 29.5 కోట్లు- రాబట్టింది. ఇందులో కేవలం పాన్ ఇండియా వారీగా 4,388 షోస్ కు గాను రూ. 18.11 కోట్లతో 40.04శాతం ఆక్యుపెన్సీ రాబట్టింది.




HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NUMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEE,TV.COM